# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్.టి.ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 2 సంచిక : 42 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 16 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :42 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE FRI 16 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## హర్మూజ్‌లో కుప్పలుగా తేలియాడుతున్న ఐఫోన్లు



హర్మూజ్ జలసంధిలో ఓ కార్గో నౌక ( మునిగిపోయింది. సీమైన్‌ను ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసు కున్నట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ వెల్లడించింది. అయితే, మైన్‌ను ఢీకొట్టి నౌక మునిగిపోయినట్లుగా ఐఆర్‌జీసీ ప్రకటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

- మిగతా 2లో





## కుప్పకూలిన పాఠశాల పైకప్పు..
## 34 మంది విద్యార్థులు మృతి

పాకిస్థాన్ లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రైవేటు పాఠశాల పైకప్పు కూలి 34 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో అత్యధికులు 13 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులే కావడం విషాదకరం. పెషావర్ లో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది

- మిగతా 2లో

## భారత్ వైర్‌లెస్ డేటాలో 60 శాతం మాదే

- అక్టోబర్ 21 నుంచి 23 వరకు జియో ప్లాట్‌ఫామ్స్ మెగా ఐపీఓ
- కంపెనీకి 53.3 కోట్ల మంది కస్టమర్లు, అందులో 28.5 కోట్ల మంది 5జీ యూజర్లు
- రూ.30,213 కోట్లు సమీకరించడమే లక్ష్యంగా ఐపీఓ ఇష్యూ
- భారత్‌ను అతిపెద్ద డిజిటల్ సొసైటీగా మార్చడమే లక్ష్యమన్న జియో

- మిగతా 2లో



## సంక్షేమం నుంచి స్వావలంబన దిశగా..
# ఇదే మా విధానం

- విజయవాడలో జాతీయ సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు
- గ్రామీణ మహిళల ఉత్పత్తుల కోసం 'స్వయం ఏపీ' బ్రాండ్ ఆవిష్కరణ
- మహిళలను సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు
- రాబోయే ఐదేళ్లలో మరో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తల తయారీకి ప్రణాళిక
- ప్రతి గ్రామాన్ని ఉపాధి కేంద్రంగా మార్చడమే ధ్యేయమని స్పష్టీకరణ



మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా పరిమితం చేయకుండా, వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆర్థిక స్వావలంబన దిశగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, సంపద సృష్టికర్తలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, గ్రామీణ మహిళల నైపుణ్యాలకు, ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో వేదిక కల్పిస్తున్న జాతీయ సరస్ మేళా-2026ను విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. దసరా శరన్నవరాత్రుల వేళ ఇంద్రకీలాద్రి సాక్షిగా ఈ మేళా నిర్వహించడం నగరానికి మరింత శోభను తెచ్చిందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి, ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత పదవిని అలంకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.



- మిగతా 2లో



## మున్సిపల్ పోరుకు వైసీపీ అభ్యర్థులు ఖరారు..
### మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల పూర్తి జాబితా విడుదల

- మేయర్లు, ఛైర్మన్ల పూర్తి జాబితాను విడుదల చేసిన వైసీపీ అధిష్ఠానం
- వైఎస్ జగన్ ఆమోదంతో తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన
- జాబితాలో మహిళలు, బీసీ, ఎస్సీ వర్గాలకు గణనీయమైన ప్రాధాన్యం
- 7 కార్పొరేషన్లు, 14 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు అభ్యర్థుల పేర్లు వెల్లడి

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల సమరానికి వైసీపీ పూర్తిస్థాయిలో సిద్ధమైంది. పార్టీ అధ్యక్షుడు జగన్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులను, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఛైర్మన్ అభ్యర్థులను ఖరారు చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం అధికారికంగా పత్రికా ప్రకటన ద్వారా అభ్యర్థుల పూర్తి జాబితాను విడుదల చేసింది.

- మిగతా 2లో



## విచ్ఛిన్నకర శక్తులతో జగన్ చేతులు కలిపారు

అమరావతి: కేసులు ఎదుర్కొంటున్న జగన్‌తో చేతులు కలపడం ద్వారా కాక్రోచ్ జనతా పార్టీ అజెండా ఏంటో స్పష్టమైందని భాజపా ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఎద్దేవా చేశారు. "నాడు ఆలయాల ఆస్తుల ఆక్రమణ, మత మార్పిడులను

- మిగతా 2లో

## సీట్ల సర్దుబాటు అంశం.. చంద్రబాబుతో మంత్రుల చర్చలు

ఉండవల్లి: పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐక్యంగా పోటీ చేయాలని నిర్ణయించిన కూటమి నేతలు.. ఎవరు, ఎక్కడ బరిలోకి దిగాలన్న అంశంపై

- మిగతా 2లో



## విజయవాడ దుర్గమ్మకు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం విరాళం

- శ్రీకాకుళం జిల్లాకు చెందిన భక్తుడు దుర్గా శ్రీనివాస్ సమర్పణ
- 494 గ్రాముల బంగారంతో నవరత్నాలతో కిరీటం తయారీ
- దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ ఈ కానుక అందజేత

- మిగతా 2లో



## దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు..
# 12 కొత్త హాల్టులు

- దేశవ్యాప్తంగా 4 కొత్త రైలు సర్వీసులకు రైల్వే బోర్డు ఆమోదం
- ప్రయాణికుల సౌలభ్యం కోసం 3 రైళ్లను పొడిగించాలని నిర్ణయం
- మరో 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్ల ఏర్పాటు
- త్వరలో తేదీలను ప్రకటించనున్న సంబంధిత రైల్వే జోన్లు

- మిగతా 2లో






## నారాయణపేటలో దారుణం
### పెట్రోల్ పోసి భర్తను సజీవ దహనం చేసిన భార్య

- వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్తను హత్య చేసిన భార్య
- నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో జరిగిన దారుణ ఘటన
- నిద్రిస్తున్న భర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించి దాడి
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు మృతి
- నేరం అంగీకరించిన నిందితురాలు.. కేసు నమోదు చేసిన పోలీసులు

- మిగతా 2లో

## సీఈసీని రక్షించేందుకే ఇదంతా

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) నేత అభిజిత్ దీప్కే సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వ వనరులను వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష నేతలు, నిరసనకారులను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని గురువారం



- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను రక్షించేందుకు మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని సీజేపీ ఆరోపణ
- ఎన్నికల జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారని అభిజిత్ దీప్కే విమర్శ
- ప్రభుత్వానిది 'ఒకే దేశం, ఒకే పార్టీ' నినాదమని విమర్శలు
- నటుడు ప్రకాశ్ రాజ్, ఇతర నేతలతో కలిసి దీప్కే మీడియా సమావేశం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# వ్యూహం ఉత్తుత్తిదేనా.. మళ్లీ సేనలో అదే రిపీట్ అవుతుందట

జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు నాయకత్వాన్ని పెంపొందించుకు నే పనిలో కన్నా టీడీపీ నేతలకు కండువాలు కప్పడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా జనసేన పార్టీలోకి టీడీపీ నేత వంగవీటి రాధాకృష్ణ చేరారు. పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన వంగవీటి రాధాకృష్ణను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ కండువా కప్పి పవన్ కల్యాణ్ వంగవీటి రాధా కృష్ణను జనసేన పార్టీలోకి పవన్ ఆహ్వానించారు. వంగవీటి రాధాకృష్ణతో పాటు జనసేన పార్టీలో చేరిన తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కు చేరారు. జనసేన నుంచి విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ పేరు వినిపిస్తుండటంతో ఆయన జనసేనలో చేరడం చర్చనీయాంశంగా మారింది. అలాగే తిరుపతి మేయర్ అభ్యర్థిగా ప్రణీత్ ప్రమోద్ పేరు కూడా వినిపిస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ పవన్ కల్యాణ్ ఇదే రకమైన వ్యూహాన్ని అనుసరించారు. తిరిగి స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే స్ట్రాటజీనా? అంటూ జనసైనికులే పెదవి విరుస్తున్నారు.

**పలు దఫాలు చర్చలు జరిపినా...**

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి పార్టీలైన టీడీపీ, జనసేనల మధ్య సీట్ల సర్దుబాటు మరియు రాజకీయ వ్యూహాలపై విస్తృత చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన విజయవంతమైన పొత్తు ఫార్ములానే ఇక్కడ కూడా కొనసాగించాలని భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు అమరావతిలో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. ఈ చర్చల్లో భాగంగా జనసేన పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆరు కార్పొరేషన్లలో మేయర్ పదవి, అలాగే 26 మున్సిపాలిటీలను తమకు కేటాయించాలని కోరుతున్నట్లు సమాచారం. గత ఎన్నికలకు ముందు కూడా ఎమ్మెల్యే అభ్యర్థులను టీడీపీ నుంచి వైసీపీ నుంచి పార్టీలోకి చేర్చుకుని వారికి టికెట్లు ఇవ్వడంతో ఇప్పుడు అసలైన జనసేన కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందన్న భావన వ్యక్తమవుతుంది.

**అత్యధిక మంది టీడీపీ వారే...**

జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇంత మంది ఉన్నా వారిలో అత్యధిక మంది టీడీపీకి చెందిన వారేనని, ఇక చంద్రబాబు తాను సీట్లు ఇవ్వలేని వారిని జనసేనలోకి పంపి అక్కడ సీట్లు దక్కేలా చేస్తున్నారని జనసేన నేతలు సోషల్ మీడియాలో వాపోతున్నారు. దీనివల్ల వాస్తవంగా పార్టీ కోసం నిబద్ధతగా పనిచేసిన నేతలకు అన్యాయం జరుగుతుందని, ఇదే స్ట్రాటజీని తిరిగి స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అనుసరించడంపైన కూడా కొంత వ్యతిరేకత వ్యక్తమవుతుంది. అయితే గెలుపు గుర్రాలనే ఎంపిక చేస్తున్నామని జనసేన నాయకత్వం చెప్పుకుంటుంది. గెలుపు గుర్రాల ఎంపిక, కొన్ని స్థానాల్లో స్థానిక సమీకరణాల దృష్ట్యా సమర్థులైన నేతలను బరిలోకి దించేందుకు ఇరు పార్టీల మధ్య సమన్వయ కమిటీలు కూడా పనిచేయనున్నాయి. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే సమర్థత ఆధారంగా సీట్ల కేటాయింపు జరగవచ్చని తెలుస్తోంది. ఈ స్థానిక సంస్థల ఎన్నికల సీట్ల సర్దుబాటు వ్యవహారం లో అగ్రనేతలు కలసి ఉన్నట్లు చేతులు కలిపినా కింది స్థాయిలో ఓట్ల బదిలీ అనేది జరగకపోవచ్చన్న అభిప్రాయం బలంగా వినపడుతుంది.

## భారత్ వైర్‌లెస్ డేటాలో 60 శాతం మాదే

రిలయన్స్ జియో ప్లాట్‌ఫామ్స్ తన మెగా ఐపీఓకు రంగం సిద్ధం చేసింది. ఈ నెల అక్టోబర్ 21 నుంచి 23 వరకు ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ సందర్భంగా ముంబైలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ మాట్లాడుతూ, జియో సాధించిన ప్రగతిని, భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. దేశవ్యాప్త వైర్‌లెస్ డేటా ట్రాఫిక్‌లో 60 శాతానికి పైగా వాటాను జియో నెట్‌వర్క్ దక్కించుకుందని ఆయన వెల్లడించారు. 2026 జూన్ 30 నాటికి జియో వినియోగదారుల సంఖ్య 53.3 కోట్లకు చేరిందని, వీరిలో 28.5 కోట్ల మంది 5జీ వినియోగదారులేనని ఆకాశ్ అంబానీ తెలిపారు. చైనా మినహా ప్రపంచంలోనే ఇంతటి భారీ కస్టమర్ బేస్ కలిగిన ఏకైక సంస్థగా జియో నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఒక్కో వినియోగదారుడి సగటు నెలవారీ డేటా వినియోగం 43.7 జీబీకి పెరిగిందని, ఇది దేశంలో మారుతున్న డిజిటల్ అవసరాలకు నిదర్శనమని వివరించారు. 2016లో జియో సేవలు ప్రారంభమైన సమయంలో దేశంలో సగటు ఇంటర్నెట్ డౌన్‌లోడ్ వేగం కేవలం 2.5 ఎంబీపీఎస్‌గా ఉండగా, ఇప్పుడు అది 68 ఎంబీపీఎస్‌కి పెరిగిందని ఆయన గుర్తుచేశారు. జియో 5జీ సగటు డౌన్‌లోడ్ స్పీడ్ 198.9 ఎంబీపీఎస్‌గా నమోదైందని పేర్కొన్నారు. సరసమైన ధరలకే డేటా లభిస్తుండటంతో ఆన్‌లైన్ వీడియో స్ట్రీమింగ్, డిజిటల్ చెల్లింపులు వంటి సేవలు గణనీయంగా విస్తరించాయని ఆయన అభిప్రాయపడ్డారు. కంపెనీ నెట్‌వర్క్ సామర్థ్యాన్ని వివరిస్తూ, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 3,60,537 టవర్లు, 26,800 వీఎఓ స్పెక్ట్రమ్‌తో సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ నిర్వహణ లాభం 17.8 శాతం వృద్ధితో రూ. 76,225 కోట్లుగా నమోదైందని తెలిపారు. అలాగే, జియో హోమ్ బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్ల సంఖ్య కూడా 2.8 కోట్లకు చేరుకుందని వివరించారు. భారత్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ సమాజంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని ఆకాశ్ అంబానీ పునరుద్ఘాటించారు. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన నెట్‌వర్క్ సాఫ్ట్‌వేర్, పరికరాలను అంతర్జాతీయ ఆపరేటర్లకు విక్రయించే దిశగా యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. 2031 నాటికి భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ 1.4 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నామని, అందులో ప్రధాన వాటాను కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ ఐపీఓ ద్వారా ఒక్కో షేరుకు రూ. 1,065 నుంచి రూ. 1,119 ధరల శ్రేణిలో గరిష్ఠంగా రూ. 30,213 కోట్లను సమీకరించాలని జియో భావిస్తోంది. ఈ ఇష్యూలో భాగంగా రూ. 10 ముఖ విలువ కలిగిన 27 కోట్ల నూతన షేర్లను జారీ చేయనుంది. ఇది భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓలలో ఒకటిగా నిలవనుంది.

## సీఈసీని రక్షించేందుకే ఇదంతా

- మొదటి పేజి తరువాయి

ఆరోపించారు. ఢిల్లీలో నటుడు ప్రకాశ్ రాజ్, మరో నేత నేహా బోరాలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అభిజిత్ దీప్కే మాట్లాడారు. సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. "ఒక్క జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటం కోసం ఢిల్లీ యువత వీధుల్లో పోరాడుతుంటే వారిని ఈడ్చుకెళుతున్నారు. సొంత పౌరుల మీదనే ప్రభుత్వం యుద్ధం చేస్తోంది. సీఈసీని రక్షించడానికి ఇంత రాద్ధాంతం ఎందుకు?" అని దీప్కే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ**

ఎన్నికల కమిషన్ తీరును, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను దీప్కే తీవ్రంగా తప్పుబట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా కూటముల మధ్య ఓట్ల తేడా కేవలం 2 శాతమేనని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి సహాయం చేస్తున్నారని ప్రజలు ఎందుకు అనుమానించకూడదని ప్రశ్నించారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించిందని దీప్కే సంచలన ఆరోపణ చేశారు. ఓటర్ల జాబితాలో చనిపోయినట్లు ప్రకటించబడిన కొందరు వ్యక్తులను తాను కలిశానని ఆయన తెలిపారు. మోదీ ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని ఉపయోగించి జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతోందని విమర్శించారు.

**'ఒకే దేశం, ఒకే పార్టీ' అజెండా**

ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనేది కేవలం ఒక నినాదం మాత్రమేనని, దాని వెనుక ఉన్న అసలు అజెండా 'ఒకే దేశం, ఒకే పార్టీ' అని దీప్కే విమర్శించారు. దమ్ముంటే దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆయన ప్రధాని మోదీకి సవాల్ విసిరారు. అంతర్జాతీయ సమాజం ఏమనుకుంటుందోనని ప్రధాని భయపడుతున్నారా? అని ప్రశ్నించారు.

**సీజేపీ నేతల అరెస్ట్**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జంతర్ మంతర్ వద్ద సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా, అజింక్యా షిండే నిరసన చేపట్టారు. పోలీస్ బారికేడ్లను దాటి నినాదాలు చేయడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ అధికారి విధులకు ఆటంకం కలిగించారనే అభియోగంపై కేసు నమోదు చేసి, దాస్, రంకాలను జ్యుడీషియల్ కస్టడీకి పంపి తీహార్ జైలుకు తరలించారు. అజింక్యా షిండేను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీజేపీ లీగల్ టీం హెడ్ రత్నా సింగ్ తెలిపారు. తమ నేతల అరెస్టులను, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని సీజేపీ స్పష్టం చేసింది.

# సంక్షేమం నుంచి స్వావలంబన దిశగా.. ఇదే మా విధానం

- మొదటి పేజి తరువాయి

**గ్రామాలే ఉపాధి కేంద్రాలుగా..**

రాష్ట్రంలో 1.10 కోట్ల మంది సభ్యులతో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా) ఉన్నాయని, ఇవి ఏటా రూ. 69 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తున్నాయని చంద్రబాబు వివరించారు. నిన్నటి పొదుపు సంఘాలు నేడు వ్యాపార సంస్థలుగా రూపాంతరం చెందుతున్నాయని, భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ మేళాలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని, ఇది కేవలం ప్రదర్శన కాదని, గ్రామీణ ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెటింగ్ అవకాశాలు కల్పించే దిశగా తొలి అడుగని పేర్కొన్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ, కొత్త వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని మహిళలకు సూచించారు.

**సాంకేతికతతో ప్రపంచ మార్కెట్‌కు..**

'స్వయం ఏపీ' బ్రాండ్ ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేస్తామని చంద్రబాబు తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు. మహిళల భద్రత, ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూనే, వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఒక ఉపాధి కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేటలో దారుణం

## పెట్రోల్ పోసి భర్తను సజీవ దహనం చేసిన భార్య

వివాహేతర సంబంధం ఒక కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. భర్త మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాడన్న ఆగ్రహంతో రగిలిపోయిన భార్య, పెట్రోల్ పోసి నిప్పంటించి అతడిని దారుణంగా హత్య చేసింది. ఈ ఘోరం తెలంగాణలోని నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో చోటుచేసుకుంది. మరికల్ మండలం మద్వార్ గ్రామానికి చెందిన బాలస్వామి (46), తెలపల్లి రాములమ్మ దంపతులకు 28 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, బాలస్వామి అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రాములమ్మ భర్తను పలుమార్లు నిలదీసింది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గత కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సెప్టెంబర్ 24వ తేదీ రాత్రి బాలస్వామి ఇంట్లో నిద్రిస్తుండగా, రాములమ్మ ఈ ఘాతుకానికి పాల్పడింది. వ్యవసాయ పనుల కోసం ఇంట్లో నిల్వ ఉంచిన పెట్రోల్‌ను భర్తపై పోసి నిప్పంటించింది. తీవ్ర గాయాలతో హాహాకారాలు చేసిన బాలస్వామిని గమనించిన స్థానికులు, చికిత్స నిమిత్తం తొలుత మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 25న అతను మృతి చెందాడు. ఈ ఘటనపై డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ, మృతుడి నుంచి సేకరించిన మరణ వాంగ్మూలం, ఇతర సాక్ష్యాధారాలు ఆధారంగా రాములమ్మను విచారించగా, ఆమె నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితురాలిపై భారతీయ న్యాయ సంహిత (దీచీూ) కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

## కుప్పకూలిన పాఠశాల పైకప్పు.. 34 మంది విద్యార్థులు మృతి

ఉదయం పూట తరగతులు జరుగుతుండగా పాఠశాల భవనం పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. సమాచారం అందుకున్న సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని చర్యలు చేపట్టాయి. ఈ దుర్ఘటనలో 34 మంది విద్యార్థులతో పాటు ఓ ఉపాధ్యాయురాలు కూడా మరణించినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. మరో 40 మందికిపైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రమాదం నేపథ్యంలో పాఠశాల యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## విచ్ఛిన్నకర శక్తులతో జగన్ చేతులు కలిపారు

- మొదటి పేజి తరువాయి

జగన్ ప్రోత్సహించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేశారు. నేడు రాజకీయ లబ్ధి కోసం దేశ విచ్ఛిన్నకర శక్తులతో చేతులు కలిపారు. వైకాపా పాలనలో ఎదురైన ఇబ్బందులను రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదు. ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అస్థిరత, విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న శక్తులతో కలిసి జగన్ సాగిస్తున్న రాజకీయ ప్రయత్నాలను వారు నిశితంగా గమనిస్తున్నారు. తగిన సమయంలో ప్రజాస్వామ్యబద్ధంగా తమ తీర్పును వెల్లడిస్తారు" అని పేర్కొన్నారు. సీజేపీకి మద్దతుగా జగన్ చేసిన పోస్టు.. దానికి సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ధన్యవాదాలు తెలపడం ఏపీ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

## విజయవాడ దుర్గమ్మకు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం విరాళం

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారికి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భారీ కానుక అందింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ భక్తుడు సుమారు రూ. 75 లక్షల విలువైన స్వర్ణ కిరీటాన్ని అమ్మవారికి విరాళంగా సమర్పించారు. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కుర్మినాయుడు, పద్మావతమ్మ దంపతుల కుమారుడైన కె. దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని విరాళంగా ఇచ్చారు. 494 గ్రాముల స్వచ్ఛమైన బంగారంతో రూపొందించిన ఈ కిరీటంలో ఎరుపు, నీలం, తెలుపు, ఆకుపచ్చ రంగుల నవరత్నాలను పొదిగారు. దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శీనానాయక్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతోనే ఈ కానుకను సమర్పించానని, పవిత్రమైన నవరాత్రుల సమయంలో కిరీటాన్ని అందించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజలు, దర్శనాల నడుమ ఈ విరాళం అందడం విశేషం.

## సీట్ల సర్దుబాటు అంశం.. చంద్రబాబుతో మంత్రుల చర్చలు

- మొదటి పేజి తరువాయి

తుది కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, ఎంపీ లింగమనేని రమేష్ తదితరులు భేటీ అయ్యారు. సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రారంభం కానుండటంతో ఈ ప్రక్రియను త్వరగా కొలిక్కి తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నారు.

# దేశంలో 4 కొత్త రైళ్లు, 3 పొడిగింపులు.. 12 కొత్త హాల్టులు

దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులకు భారతీయ రైల్వే శుభవార్త అందించింది. కనెక్టివిటీని మెరుగుపరిచే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా 4 కొత్త రైలు సర్వీసులను ప్రారంభించేందుకు, ఇప్పటికే నడుస్తున్న 3 రైళ్లను పొడిగించేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. వీటితో పాటు, ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఆధారంగా 12 ముఖ్యమైన రైళ్లకు కొత్తగా హాల్టింగ్ స్టేషన్లను కేటాయించింది.

ఈ మార్పులకు సంబంధించిన రైళ్ల ప్రారంభ తేదీలు, పొడిగింపు తేదీలను సంబంధిత రైల్వే జోన్లు త్వరలో వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా వెల్లడిస్తాయని అధికారులు తెలిపారు.

**కొత్తగా ఆమోదం పొందిన రైళ్లు:**

1. రాయ్‌పూర్ -- రౌఘాట్ మెమూ (68768/68769): ఈ రైలు శనివారం మినహా వారానికి 6 రోజులు నడుస్తుంది.
రౌఘాట్ నుంచి ఉదయం 6:30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1:05 గంటలకు రాయ్‌పూర్ చేరుకుంటుంది.
రాయ్‌పూర్ నుంచి మధ్యాహ్నం 1:20 గంటలకు బయలుదేరి రాత్రి 7:00 గంటలకు రౌఘాట్ వెళుతుంది.
2. హరిద్వార్ -- వెరావల్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (14326/14325): ఇది వారానికి రెండుసార్లు నడిచే సర్వీస్.
ఈ రైలు హరిద్వార్ నుంచి బుధ, ఆదివారాల్లో; వెరావల్ నుంచి గురు, సోమవారాల్లో నడుస్తుంది.
**హాల్టులు:** రూర్కీ, ముజఫర్‌నగర్, మీరట్ సిటీ, ఘజియాబాద్, ఢిల్లీ, రేవారి, జైపూర్, అజ్మీర్, అబూ రోడ్, పాలన్‌పూర్, రాజ్‌కోట్, జునాగఢ్ వంటి ప్రధాన స్టేషన్లలో ఆగుతుంది.
3. హరిద్వార్ -- ఓఖా ఏసీ ఎక్స్‌ప్రెస్ (14328/14327): ఇది వారానికి ఒకసారి నడిచే సర్వీస్.
హరిద్వార్ నుంచి శుక్రవారం, ఓఖా నుంచి శనివారం బయలుదేరుతుంది.
హాల్టులు: రూర్కీ, మీరట్ సిటీ, ఢిల్లీ, జైపూర్, అజ్మీర్, అబూ రోడ్, రాజ్‌కోట్, జామ్‌నగర్, ద్వారకలలో ఆగుతుంది.
4. బీర్ - ఇటార్సీ ప్యాసింజర్ (51689/51690): వారానికి ఒకసారి నడుస్తుంది.
బీర్ నుంచి శనివారం, ఇటార్సీ నుంచి ఆదివారం అందుబాటులో ఉంటుంది.

**పొడిగించిన సర్వీసులు:**

1. బాంద్రా (T) -- ఢిల్లీ సరాయ్ రోహిల్లా గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12216/12215): ఈ రైలును హరిద్వార్ వరకు పొడిగించారు. పొడిగింపు మార్గంలో ఢిల్లీ, ఘజియాబాద్, మీరట్ సిటీ, ముజఫర్‌నగర్, రూర్కీలలో అదనపు స్టాపులు ఉంటాయి.
2. గోండియా - వాడ్సా మెమూ (68806): ఈ రైలును అర్మోరి వరకు పొడిగించారు.
3. వాడ్సా - చందా ఫోర్ట్ మెమూ (68808): ఈ రైలును కూడా అర్మోరి వరకు పొడిగించారు.

**కొత్తగా కేటాయించిన హాల్టులు:**

కింది 12 రైళ్లకు కొత్తగా హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.
వల్సాడ్-వడనగర్ ఎక్స్‌ప్రెస్ (20959/20960): అంకలేశ్వర్
హతియా-హౌరా క్రియ యోగా ఎక్స్‌ప్రెస్ (18616): చకులియా
సహర్సా-అమృత్‌సర్ గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (12203/12204): పానిపట్
హైదరాబాద్-రక్సాల్ ఎక్స్‌ప్రెస్ (17005/17006): రిగా
దర్భంగా-గోమతి నగర్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ (15561/15562): రిగా
తిరుపతి-రక్సాల్ ఎక్స్‌ప్రెస్ (17433/17434): బైరగ్నియా
లౌకహా బజార్--ఆనంద్ విహార్ టెర్మినల్ స్పెషల్ (04013/04014): ఘోరసహన్
బాంద్రా (౮)--జైపూర్ ఎక్స్‌ప్రెస్ (22933/22934): నవ్‌సారి
అలప్పుజ-కన్నూర్ ఎక్స్‌ప్రెస్ (16307): వల్లిక్కున్ను
KSR బెంగళూరు-ఎర్నాకుళం జంక్షన్ ఎక్స్‌ప్రెస్ (16377/16378): ఒట్టపాలెం
లోకమాన్య తిలక్ టెర్మినస్-పాట్లీపుత్ర ఎక్స్‌ప్రెస్ (12141/12142): గహ్మర్
సీల్దా-రాంపూర్‌హట్ ఎక్స్‌ప్రెస్ (13187/13188): బారక్‌పూర్

ఈ కొత్త సర్వీసులు, పొడిగింపులు, అదనపు హాల్టుల వల్ల పలు ప్రాంతాల మధ్య ప్రయాణ సౌకర్యం గణనీయంగా మెరుగుపడుతుందని, ప్రయాణికుల సమయం ఆదా అవుతుందని రైల్వే శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

## మున్సిపల్ పోరుకు వైసీపీ అభ్యర్థులు ఖరారు..

- మొదటి పేజి తరువాయి

మొత్తం 27 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, సామాజిక సమీకరణాలు, మహిళా ప్రాతినిధ్యానికి పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోంది.

**7 కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులు వీరే:**

వైసీపీ ప్రకటించిన జాబితా ప్రకారం, ఏడు కీలక నగర పాలక సంస్థలకు మేయర్ అభ్యర్థులను ఖరారు చేశారు.
విజయనగరం (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): కోలగట్ల శ్రావణి (వైశ్య)
విశాఖపట్నం (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): వరుదు కల్యాణి (కాపు వెలమ)
ఏలూరు (బీసీ): గంటా మోహన్ రావు (తూర్పు కాపు)
మచిలీపట్నం (బీసీ - మహిళ): లంకా జ్యోతి (తూర్పు కాపు)
ఒంగోలు (అన్‌రిజర్వ్‌డ్): కుప్పం ప్రసాద్ (వైశ్య)
నెల్లూరు (అన్‌రిజర్వ్‌డ్): ఆనం విజయ్ కుమార్ రెడ్డి (రెడ్డి)
కడప (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): బండి దీప్తిరెడ్డి (రెడ్డి)

**మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్మన్ అభ్యర్థులు:**

రాష్ట్రవ్యాప్తంగా 14 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు ఛైర్మన్ అభ్యర్థులను పార్టీ అధిష్ఠానం ప్రకటించింది.

**మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థుల జాబితా:**

ఇచ్ఛాపురం (బీసీ - మహిళ): పిలక రాజ్యలక్ష్మి (రెడ్డిక)
పలాస-కాశీబుగ్గ (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): తలసు శ్రీ పద్మ (కళింగ వైశ్య)
నర్సీపట్నం (బీసీ - మహిళ): చింతకాయల అనిత (కాపు వెలమ)
యలమంచిలి (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): బొద్దపు తులసి (కాపు)
తుని (బీసీ - మహిళ): పిట్ల రామ తులసి (శెట్టిబలిజ)
కొవ్వూరు (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): మన్నె పద్మ (కమ్మ)
రామచంద్రాపురం (బీసీ): చింతపల్లి నాగేశ్వరరావు (శెట్టిబలిజ)
కొండపల్లి (ఎస్సీ - మహిళ): నల్లమోతు తేజస్విని (మాదిగ)
తెనాలి (అన్‌రిజర్వ్‌డ్): మద్దాలి శేషాచలం (వైశ్య)
చీరాల (ఎస్సీ - మహిళ): డాక్టర్ ఇస్రార్ల షెర్లీ (మాల)
బద్వేల్ (అన్‌రిజర్వ్‌డ్): రాచపూడి వెంకట సాయి కృష్ణ (వైశ్య)
ప్రొద్దుటూరు (అన్‌రిజర్వ్‌డ్): పొరెడ్డి నరసింహారెడ్డి (రెడ్డి)
పులివెందుల (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): వైయస్ ప్రమీలమ్మ (రెడ్డి)
మదనపల్లె (బీసీ): జింకా చలపతి (బోయ)

**నగర పంచాయతీ ఛైర్మన్ అభ్యర్థులు:**

యలేశ్వరం (ఎస్సీ - మహిళ): బదిరెడ్డి ఆశాలత (మాదిగ)
వుయ్యూరు (ఎస్సీ): పైడముక్కల దివ్య (మాదిగ)
గురజాల (అన్‌రిజర్వ్‌డ్): పోలు వీరారెడ్డి (రెడ్డి)
కనిగిరి (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): పులి శాంతి రెడ్డి (రెడ్డి)
బుచ్చిరెడ్డిపాలెం (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): షేక్ షకీలా బేగం (ముస్లిం)
కమలాపురం (అన్‌రిజర్వ్‌డ్ - మహిళ): మార్జుల కవిత (రెడ్డి)

పార్టీ విడుదల చేసిన ఈ జాబితాలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించారు. మొత్తం 27 స్థానాల్లో 14 స్థానాలు మహిళలకే కేటాయించడం విశేషం. అదేవిధంగా, బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు కూడా గణనీయమైన సంఖ్యలో అవకాశాలు ఇచ్చారు. ఈ ప్రకటనతో ఆయా నగరాలు, పట్టణాల్లో ఎన్నికల సందడి అధికారికంగా మొదలైంది. పార్టీ ప్రకటించిన అభ్యర్థులు త్వరలోనే నామినేషన్లు దాఖలు చేసి, ప్రచార బరిలోకి దిగనున్నారు.

# హర్మ్యూజ్‌లో కుప్పలుగా తేలియాడుతున్న ఐఫోన్లు

చట్ట విరుద్ధమైన, ప్రమాదకర మార్గంలో నౌక ప్రయాణిస్తున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు చెప్పినట్లు స్థానిక మీడియా పేర్కొంది.

ప్రమాదానికి గురైన నౌక దాదాపు 2500 కంటైనర్లతో వెళు న్నట్లు సమాచారం. వీటిలో ఐఫోన్లు, లగ్జరీ పెర్ఫ్యూమ్ బాటిళ్లు, తదితర వస్తువులున్నాయి. ప్రమాదం అనంతరం కంటైనర్లు చెల్లాచెదురు కాగా.. అందులోని ఐఫోన్‌లు సహా ఇతర వస్తువులు కుప్పలుగా నీటిపై తేలియాడుతున్న దృశ్యాలు కనిపించాయి. జీఎఫ్ఎస్ ప్రైడ్ అనే సింగపూర్ జెండా ఉన్న నౌక దుబాయ్ నుంచి ఈ సరకులను తీసుకువెళ్తున్నట్లు తెలుస్తోంది.

హర్మ్యూజ్ మార్గంలో వెళ్తున్న సమయంలో సింగపూర్‌కు చెందిన రెండు సరకు రవాణా నౌకలు గుర్తు తెలియని వస్తువులను ఢీకొన్నాయని నౌకాశ్రయ అధికారులు తొలుత పేర్కొన్నారు. ఇందులో ఒకటి మునిగిపోగా.. మరొకటి సురక్షితంగా గమ్యాన్ని చేరుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మొదటి నౌకలోని సిబ్బంది అందర్నీ సురక్షితంగా తరలించామని, ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని సింగపూర్ పోర్టు అధికారులు వెల్లడించారు.

# ఏల్చూరు జంట హత్య ఘటనలో 108 సిబ్బంది నిర్లక్ష్యంపై విమర్శలు

## ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళకు వైద్యసాయం అందించడంలో జాప్యం జరిగిందా?

## ఘటన జరిగి నెల రోజులు గడుస్తున్నా వెలుగులోకి వస్తున్న కొత్త అంశాలు




**సంతమాగులూరు, పెన్ పవర్, అక్టోబర్ 15**

సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలోని జగనన్న కాలనీలో గత నెల 26న జరిగిన జంట హత్య ఘటనకు సంబంధించి ఒక్కొక్క అంశం ఆలస్యంగా వెలుగులోకి వస్తోంది. భార్య, అత్తపై భర్త కత్తితో దాడి చేసిన ఈ ఘటనలో ఇద్దరూ మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన భార్య వీరనారాయణమ్మకు అత్యవసర వైద్యసాయం అందించడంలో 108 సిబ్బంది నిర్లక్ష్యం వహించారా? అనే అనుమానాలు, విమర్శలు తాజాగా వ్యక్తమవుతున్నాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితురాలికి సకాలంలో వైద్యసాయం అందించారా లేదా అన్న అంశంపై సమగ్ర విచారణ జరగాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

**సమాచారం అందిన తర్వాత కూడా జాప్యం జరిగిందా?**

స్థానికుల కథనం ప్రకారం.. ఘటన జరిగిన రోజు అర్ధరాత్రి సుమారు 12 గంటలకు 108 అత్యవసర వాహనానికి సమాచారం అందించారు. సుమారు 12.20 గంటలకు వాహనం ఘటనా స్థలానికి చేరుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఇంట్లో కత్తి గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వీరనారాయణమ్మ వద్దకు వెళ్లి వెంటనే వైద్యసాయం అందించకుండా, 108 సిబ్బంది కొంతసేపు స్థానికులతో మాట్లాడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. బాధితురాలు అప్పటికే మృతి చెంది ఉండవచ్చని సిబ్బంది భావించినట్లు స్థానికులు చెబుతున్నప్పటికీ, ఆమె పరిస్థితిని వెంటనే పరీక్షించి వైద్యసాయం అందించారా లేదా అన్నది నిర్ధారించాల్సి ఉంది.

**ఎస్సై జోక్యంతో బాధితురాలిని తరలింపు**

ఘటనా స్థలానికి చేరుకున్న బల్లికురవ ఎస్సై నాగరాజు పరిస్థితిని పరిశీలిస్తుండగా వీరనారాయణమ్మ ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు గుర్తించారని స్థానికులు తెలిపారు. బాధితురాలికి తక్షణ వైద్యసాయం అందించడంలో జాప్యం జరుగుతోందన్న ఆందోళనతో ఎస్సై 108 సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారని, అనంతరం ఆమెను ఆసుపత్రికి తరలించినట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు. ప్రమాదకర పరిస్థితిలో ఉన్న బాధితురాలిని గుర్తించి వెంటనే స్పందించిన ఎస్సై చర్యలను స్థానికులు సమర్థిస్తున్నారు.

**జాప్యమే మృతికి కారణమైందా?**

తీవ్ర కత్తి గాయాలతో ఉన్న వీరనారాయణమ్మకు వెంటనే ప్రాథమిక వైద్యసాయం అందించి, ఉన్నత వైద్య సదుపాయాలున్న ఆసుపత్రికి వేగంగా తరలించి ఉంటే ఆమె ప్రాణాలు దక్కేవేమోనని స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే వైద్యపరమైన పరిస్థితులు, గాయాల తీవ్రత, చికిత్స వివరాలను పరిశీలించకుండా 108 సిబ్బంది జాప్యమే మృతికి కారణమని నిర్ధారించడం సాధ్యం కాదు. అత్యవసర కాల్ నమోదు వివరాలు, వాహనం చేరుకున్న సమయం, వైద్యసాయం ప్రారంభించిన సమయం, ఆసుపత్రికి తరలించిన వివరాలను పరిశీలిస్తేనే వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

**108 సిబ్బంది తీరుపై విచారణకు డిమాండ్**

అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడాల్సిన 108 సేవల సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారా లేదా అన్నది అధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది. అత్యవసర కాల్ వివరాలు, వాహన ప్రయాణ రికార్డులు, వైద్య నివేదికలు, సంబంధిత సిబ్బంది వివరణలను పరిశీలించి సమగ్ర విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు. నిర్లక్ష్యం జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గత నెల 26న జరిగిన జంట హత్య ఘటనలో అత్త చిలకపాటి బ్రహ్మేశ్వరి సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన వీరనారాయణమ్మ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటన జరిగి రోజులు గడుస్తున్న కొద్దీ వెలుగులోకి వస్తున్న అంశాల నేపథ్యంలో 108 సేవల పనితీరుపై సంబంధిత అధికారులు స్పందించి, ఆరోపణలపై వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

# పెన్ పవర్

## మార్కాపురం - ప్రకాశం

# ఉలవపాడు జడ్పీటీసీ అభ్యర్థిగా అమ్మనబ్రోలు వెంగళరావు...?

-పార్టీ కోసం కష్టపడిన శ్రేణులకే ప్రాధాన్యమివ్వాలి

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరుల డిమాండ్ -అవకాశం కల్పించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 15**

ఉలవపాడు మండల జడ్పీటీసీ అభ్యర్థి ఎంపికపై వైఎస్సార్‌సీపీలో అప్పుడే రాజకీయ చర్చ మొదలైంది. పార్టీ ఆవిర్భావం నుంచి జెండా మోస్తూ, కష్టకాలంలోనూ పార్టీకి అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలకు ఎన్నికల్లో ప్రాధాన్యం ఇవ్వాలనే డిమాండ్ స్థానికంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో అమ్మనబ్రోలు వెంగళరావుకు జడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. పార్టీ కోసం నిరంతరం పనిచేసిన వారిని గుర్తించి రాజకీయ అవకాశాలు కల్పించినప్పుడే క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**పార్టీ కోసం పనిచేసిన వారికే గుర్తింపు ఇవ్వాలి**

పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నంటి నిలిచి, ప్రజల్లో పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకులకు తగిన గుర్తింపు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు కోరుతున్నారు. ఇటీవల ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన వారికి లేదా కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇచ్చే బదులు, మొదటి నుంచి పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న శ్రేణులకు అవకాశాలు కల్పించాలని వారు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయంలో పార్టీ కోసం శ్రమించిన కేడర్ ఆకాంక్షలను విస్మరిస్తే, భవిష్యత్తులో కార్యకర్తల ఉత్సాహం తగ్గే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

**యువతకు అవకాశాలు కల్పించాలని వెంగళరావు విజ్ఞప్తిలి**

అమ్మనబ్రోలు వెంగళరావు సైతం యువతకు రాజకీయాల్లో తగిన అవకాశాలు కల్పించాలని పార్టీ నాయకత్వాన్ని కోరుతున్నారు. ఉలవపాడు మండల జడ్పీటీసీ స్థానానికి పోటీ చేసేందుకు తాను అన్ని విధాలా సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. పార్టీ అధిష్ఠానం తనకు అవకాశం కల్పిస్తే, ప్రజల మద్దతుతో విజయం సాధించి తన సత్తా చాటుతాననే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. యువతకు ప్రోత్సాహం అందించడం ద్వారా పార్టీకి కొత్త ఉత్సాహం, క్షేత్రస్థాయిలో మరింత బలం చేకూరుతాయని ఆయన అభిప్రాయపడుతున్నారు.

**బుర్ర మధుసూదన్ యాదవ్ ఆశీస్సులపై ఆశలు..**

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆశీస్సులు తనకు కావాలని అమ్మనబ్రోలు వెంగళరావు కోరుతున్నారు. పార్టీ నాయకత్వం తన సేవలను గుర్తించి జడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే అభ్యర్థి ఎంపికపై పార్టీ అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

**అభ్యర్థి ఎంపికపైనే రాజకీయ వర్గాల దృష్టి**

ఉలవపాడు మండలంలో జడ్పీటీసీ అభ్యర్థి ఎంపిక ఏ విధంగా ఉండబోతోందన్న అంశంపై స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. పార్టీ పట్ల విధేయత, గతంలో చేసిన సేవలు, ప్రజల్లో ఉన్న పరిచయాలు, క్షేత్రస్థాయిలో కార్యకర్తల మద్దతు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. వెంగళరావుకు అవకాశం కల్పిస్తారా? లేక అధిష్ఠానం మరో అభ్యర్థి వైపు మొగ్గు చూపుతుందా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మొత్తంగా ఉలవపాడు జడ్పీటీసీ అభ్యర్థి ఎంపిక వైఎస్సార్‌సీపీ నాయకత్వానికి ఒక కీలక నిర్ణయంగా మారనుంది. పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలనే కార్యకర్తల ఆకాంక్షలను నాయకత్వం ఏ మేరకు పరిగణనలోకి తీసుకుంటుందో, తుది నిర్ణయం ఎవరికి అనుకూలంగా ఉంటుందో వేచి చూడాల్సిందే.

# స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహిస్తాం: కలెక్టర్, ఎస్పీ




**మార్కాపురం, పెన్ పవర్ అక్టోబర్ 15**

స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, ఎస్పీ పంకజ్ కుమార్ మీనా తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో గురువారం మార్కాపురం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాకలెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ మార్కాపురం జిల్లాలో మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతా యని తెలిపారు. నామినేషన్ల దాఖలు, పరిశీలన, ఉపసం హరణ ప్రక్రియపై వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మార్కాపురం జిల్లా ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఎస్పీ పంకజ్ కుమార్ మీనా మాట్లాడుతూ సమస్యాత్మక వ్యక్తులపై బైం డోవర్ చర్యలు చేపట్టామని తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో నిబం ధనలకు విరుద్ధంగా పోస్టులు, సందేశాలు ప్రచారం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. ఫిర్యాదుల కోసం జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ లేదా 112 నంబర్‌ను సంప్రదించవచ్చని, ప్రజలు నిర్భయంగా ఓటు వేసేలా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు నామినేషన్లకు అవసరమైన పత్రాలు, పరిశీలన ప్రక్రియపై వివరించారు. ఈ సమావేశంలో ఓఎస్డీ నవజ్యోతి మిశ్రా ఐపీఎస్, ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో అధికారులు బాధ్యతతో వ్యవహరించాలి

- ఈ ఆర్ ఓ లు.. ఏ ఈ ఆర్ ఓ ల శిక్షణ. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు స్పష్టీకరణ



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ అక్టోబర్ 15**

పురపాలక ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. మునిసిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియపై ఈ ఆర్ ఓలు, ఏ ఈ ఆర్ ఓ లకు మొదటి దశ శిక్షణా కార్యక్రమం గురువారం స్థానిక ప్రకాశం భవనంలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో జరిగింది. ఎన్నికల ప్రక్రియలో నియమ నిబంధనలు పక్కాగా పాటించాలని కలెక్టర్ చెప్పారు. ఉల్లంఘించిన వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నామినేషన్ ప్రక్రియలో ఈఆర్ఓ లు, ఏఈఆర్ఓ లు విధులు, వారంతా నిర్వహించాల్సిన విధివిధానాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. ఇందు కొరకు ఆర్ఓ హ్యాండ్ బుక్ ను పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మున్సిపాలిటీలలో పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సమర్థంగా నిర్వహించాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల్లోగా నామినేషన్ల స్వీకరణ చేపట్టాలన్నారు. 19వ తేదీన నామినేషన్ల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలన్నారు. 21వ తేదీన అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించాలన్నారు. ఈఆర్ఓ లు, ఏఈఆర్ఓల నిబద్ధతతో పనిచేయాల్సి ఉందని అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. ముఖ్యంగా నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు సమయపాలన ఉండాలని స్పష్టం చేశారు. మునిసిపల్ ఎన్నికల విధి నిర్వహణలో అత్యంత పారదర్శకత పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. తప్పులు, పొరపాట్లు చేయకుండా ఎన్నికల ప్రవర్తన నియమావళిపై పూర్తిస్థాయి అవగాహన ఉండాలన్నారు. ఎవరికి ఎలాంటి మనహాయింపులు ఉండవని, తప్పులు చేస్తే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎన్నికలు ముగిసే వరకు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు. ఆర్ఓ కార్యాలయాల వివరాలు ముందుగానే సంబంధిత వార్డులలోని ప్రజలకు ప్రకటన చేయాల్సి ఉందన్నారు. ఆ ప్రాంతంలో లా అండ్ ఆర్డర్ అమలు కొరకు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈఆర్ఓల వద్ద ముఖ్యంగా ఓటర్ల జాబితా ఉండాలని, విధుల నిర్వహణపై చెక్ లిస్ట్ పరిశీలించుకోవాలని సూచించారు. మునిసిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియపై ఈఆర్ఓ లు, ఏఈఆర్ఓ లు ప్రత్యేక దృష్టి సారించాలని బిసి కార్పొరేషన్ ఈడీ, స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్చార్జి అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలని సూచించారు. నామినేషన్ ప్రక్రియ నిర్వహణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. నామినేషన్ ప్రక్రియ ముందు, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తదుపరి చేపట్టాల్సిన విధులపై శిక్షణ ఇచ్చారు. నామినేషన్ల పరిశీలన, తిరస్కరణ, అభ్యర్థుల అర్హత వంటి పలు అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఆర్డీవో టి. చంద్రశేఖర్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్ల నిరీక్షణకు తెర..

## చైర్‌పర్సన్ పీఠం వైపు డాక్టర్ కనకదుర్గ..!

వరుస విజయాల నుంచి చేజారిన పదవి వరకు..

మళ్లీ వచ్చిన మెగా ఛాన్స్ -వైసీపీ వ్యూహం ఫలిస్తుందా



**మార్కాపురం( స్టాఫ్ రిపోర్టర్) పెన్ పవర్ అక్టోబర్ 15**

రాజకీయాల్లో కొందరికి పదవులు తక్షణమే దక్కుతాయి. మరికొందరికి పదేళ్ల నిరీక్షణ తర్వాత దక్కుతాయి. రెండో కోవకు చెందిన నేత.. మార్కాపురం ప్రముఖ వైద్యురాలు డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ. 2014లో తొలిసారి కౌన్సిలర్‌గా గెలిచి, 2019లో మళ్లీ గెలిచినా, చైర్మన్ పీఠం చేజారిన ఆమెకు 2026లో అదే పీఠం చైర్‌పర్సన్ రూపంలో మళ్లీ అవకాశంగా మారింది. మార్కాపురం వైసీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆమెను అభ్యర్థిగా ప్రకటించడంతో మార్కాపురం పురపాలక రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

**వైద్యురాలిగా గుర్తింపు.. ప్రజా ప్రతినిధిగా రెండు విజయాలు..:** మార్కాపురంలో డాక్టర్ కనకదుర్గ అంటే కేవలం వైద్యురాలు మాత్రమే కాదు,కుటుంబ వైద్యురాలు. ఆ పరిచయమే ఆమెను రాజకీయాల్లో నిలబెట్టింది. 2014లో వైసీపీ తరఫున కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలుపు.. 2019లో అదే స్థానంలో మళ్లీ గెలుపు. వరుసగా రెండుసార్లు ప్రజలు ఆమోదించడం ఆమెకు ఉన్న బలమైన పునాది. కౌన్సిలర్‌గా వార్డు సమస్యలు, మున్సిపల్ పాలనపై పూర్తి అవగాహన సంపాదించారు. ఈ అనుభవమే ఇప్పుడు ఆమెకు ప్రధాన అస్త్రం.

**2019లో ఆశలు.. చివరి నిమిషంలో మారిన లెక్కలు..:** 2019లో వైసీపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. మార్కాపురం మున్సిపాలిటీలో కూడా వైసీపీ బలంగా ఉంది. ఆ సమయంలో చైర్మన్ పదవి కనకదుర్గకే దక్కుతుందని పార్టీ శ్రేణుల్లో బలమైన చర్చ జరిగింది.కానీ రాజకీయాల్లో గెలుపు ఒక్కటే పదవిని నిర్ణయించదు. సామాజిక సమీకరణాలు, అంతర్గత ఒత్తిళ్లు, పెద్దల సిఫార్సులు చైర్మన్ పీఠాన్ని మరో వైపు మళ్లించాయి. ప్రజా తీర్పు వచ్చినా, పదవి దక్కకపోవడం ఆమె రాజకీయ ప్రస్థానంలో చేదు అనుభవంగా మిగిలింది. అయినా పార్టీని వీడకుండా నిలబడటం ఆమెలోని పట్టుదలకు నిదర్శనం.

**2026లో వ్యూహాత్మక నిర్ణయం.. అన్నా రాంబాబు పాచిక..:** 2026 మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైసీపీకి బలమైన, నమ్మకమైన, మహిళా ముఖం అవసరం. ఆ అవసరాన్ని గుర్తించిన మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు.. కనకదుర్గను చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రకటించారు.దీని వెనుక మూడు వ్యూహాలు ఉన్నాయి. ఒకటి, రెండుసార్లు కౌన్సిలర్‌గా గెలిచిన అనుభవం. రెండు.. మహిళా ఓటర్లలో, కుటుంబాల్లో ఉన్న సానుకూలత. మూడు - కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడిన విధేయత. గతంలో అవకాశం చేజారిన మహిళా నేతకు ఇప్పుడు అవకాశం ఇవ్వడం ద్వారా పార్టీ సానుభూతిని కూడా ఓటుగా మార్చుకోవచ్చని వైసీపీ లెక్క.

**హోదా కాదు.. ఇది బాధ్యతల పరీక్ష..**

మార్కాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి అంటే కేవలం కుర్చీ కాదు.. అది బాధ్యతల పీఠం. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, పేదల ఇళ్ల సమస్యలు.. ప్రతిదీ చైర్‌పర్సన్ టేబుల్ మీదకే వస్తుంది.వైద్యురాలిగా ప్రజల ఆరోగ్య సమస్యలపై అవగాహన ఉన్న కనకదుర్గ,పట్టణ అభివృద్ధిపై ఎలాంటి విజన్ చూపిస్తారనేది ఇప్పుడు ఆసక్తికరం. అభ్యర్థిత్వం రావడం ఒక ఎత్తు, ప్రజల తీర్పు సాధించడం మరో ఎత్తు. 2014లో మొదలైన ప్రయాణం. 2019లో ఎదురైన నిరీక్షణ. 2026లో మళ్లీ వచ్చిన అవకాశం. డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ రాజకీయ ప్రస్థానం మార్కాపురంలో ఇప్పుడు హాట్ టాపిక్. పదేళ్ల నిరీక్షణకు ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారో తెలియాలంటే అక్టోబర్ 28 వరకు ఆగాల్సిందే.

# అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు అందరూ సమిష్టిగా కృషి చేయాలి

## స్థానిక సంస్థల ఎన్నికలలో కొమరోలు మండలంలోని అన్ని రాజకీయ పదవులకు వైసీపీ అభ్యర్థులే ఎన్నిక కావాలి

## కొమరోలు మండలం వైసీపీకి కంచుకోట అనే పేరును మరోసారి రుజువు చేయాలి -కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన కుందూరు నాగార్జున రెడ్డి

**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 15**

స్థానిక సంస్థ ఎన్నికలలో వైసీపీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు అందరూ సమిష్టిగా కృషి చేయాలని గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం కొమరోలు మండలం చింతలపల్లి లో మండల స్థాయి వైసీపీ నేతలు, కార్యకర్తలు విస్తృత సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి కొమరోలు మండల వైసీపీ కన్వీనర్ మేరీగ రవికుమార్ అధ్యక్షత వహించగా, గిద్దలూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి,కొమరోలు మండలం మాజీ జెడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు, కొమరోలు మండల వైసీపీ సీనియర్ నాయకులు నాదెళ్ల వెంగయ్య చౌదరి,వైసిపి జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి చెదుల్ల వెంకటరమణారెడ్డి, బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ మారం రామనారాయణరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి కుందూరు నాగార్జున రెడ్డి మాట్లాడుతూ,స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూలు విడుదల అయిందని, అందువల్ల కొమరోలు మండలంలోని ఎంపీటీసీ జడ్పిటిసి స్థానాలతో పాటు సర్పంచ్ పదవులకు వైసిపి బలపరచిన అభ్యర్థులను ఎంపిక చేయాలని ఆయన మండల స్థాయి నేతలను కోరారు. మండలంలోని అన్ని గ్రామాల చెందిన వైసీపీ నేతలు, కన్వీనర్లు,కార్యదర్శులు, కార్యకర్తలు తమ గ్రామ పరిధిలో పోటీలో ఉన్న వైసీపీ అభ్యర్థుల విజయానికి సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు కొమరోలు మండలం అనాదిగా కాంగ్రెస్ పార్టీకి,ఆ తరువాత వైసిపికి కంచుకోటగా పేరు పొందుతూ వస్తున్నదని, 2024 సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీకి



ఎదురుగాలి వీచి నప్పటికీ కొమరోలు మండలంలో వైసీపీ అభ్యర్థి అయిన తనకు 1300 ఓట్ల మెజార్టీ వచ్చిందని ఆయన గుర్తు చేశారు. అందువల్ల అధికార పార్టీ బెదిరింపులకు ఒత్తిడిలకు ప్రలోభాలకు వైసిపి కార్యకర్తలు లోను కాకుండా నిర్భయంగా పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని, తద్వారా కొమరోలు మండలం వైసీపీకి కంచుకోట అనే పేరు మరోసారి సార్థకం చేయాలని ఆయన కోరారు. తనతో పాటు మండల స్థాయి నాయకులు, అభ్యర్థులకు,కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా ఉంటారని, అందువల్ల ఎలాంటి సందేహం కలిగిన ఇబ్బంది కలిగిన తమను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. మాజీ జెడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు మాట్లాడుతూ, ఎంపీటీసీ,జడ్పిటిసి, సర్పంచుల పదవులకు అభ్యర్థులను ఆయా గ్రామాలలోని నేతలు కార్యకర్తలు ఎంపిక చేయాలని,తప్పనిసరిగా గెలుస్తారనే గట్టి అభ్యర్థులను ఎంపిక చేసి పోటీ చేయించాలని, అంతేకాక పోటీలో నిలబడే అభ్యర్థి తో పాటు మరో ఇద్దరు డమ్మీ అభ్యర్థులతో కూడా నామినేషన్లు వేయించాలని ఆయన కోరారు.పోటీ చేసే అభ్యర్థులు, నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్, నో డ్యూ సర్టిఫికెట్, అఫీడవిట్, కులధృవీకరణ సర్టిఫికెట్ సిద్ధంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ప్రతి కార్యకర్త వైసిపి బలపరిచిన అభ్యర్థి ఘన విజయం సాధించేందుకు అంకితభావం చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వైసీపీ జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి చెదుల్ల రమణారెడ్డి మాట్లాడుతూ కొమరోలు మండలంలోని అన్ని ఎంపిటిసి స్థానాలతో పాటు జడ్పిటిసి ఎంపీపీ సర్పంచుల పదవులను కైవసం చేసుకుని, కొమరోలు మండలం వైసీపీకి కంచుకోట అనే పేరును మరోసారి సార్థకం చేస్తూ గిద్దలూరు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డికి కానుకగా ఇద్దామని ఆయన కార్యకర్తల హర్షధ్వనాల మధ్య పేర్కొన్నారు. కొమరోలు మండలంలోని వైసీపీ కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి అభ్యర్థుల విజయానికి కట్టుబడి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఎలాంటి త్యాగాలకైనా వెనుకాడరని అలాంటి వారికి నియోజకవర్గ మండల స్థాయి నేతలు అండగా నిలవాలని ఆయన కోరారు ఆ కార్యక్రమంలో కొమరోలు మండలంలోని మాజీ ఎంపీటీసీ సభ్యులు షేక్ మౌలాలి, ఎస్ఎం సుభాని, ఎన్ తిరుపతి రాజు, జాజం వెంకటరమణ, సారే సుజాత, జిల్లా వైసీపీ బీసీ విభాగం కార్యదర్శి సారే జనార్దన్ నాయుడు, కొమరోలు మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు ఆంజనేయులు, వైసీపీ పార్టీకి చెందిన మాజీ సర్పంచులు, గ్రామస్థాయి కన్వీనర్లు, కార్యదర్శులు, వైసిపి సోషల్ మీడియా ప్రతినిధులు గోల్కొండ బ్రదర్స్,14 గ్రామ పంచాయతీల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# పొగాకు,మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ




**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 15**

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా, కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలకు చెందిన రావెప్ విద్యార్థులు గురువారం శీలంవారిపల్లి గ్రామంలో పొగాకు, మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీని నిర్వహించారు. పొగాకు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేస్తూ విద్యార్థులు ఆకర్షణీయమైన ప్లకార్డులు, సమాచార ప్రదర్శన చార్టులను తయారుచేశారు. నినాదాలు, అవగాహన సందేశాల ద్వారా, వారు గ్రామస్తులను, సాధారణ ప్రజలను పొగాకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమం లో కళాశాల డీన్ డాక్టర్ కె మోష, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 15**

మార్కాపురం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, ఎస్పీ పంకజ్ కుమార్ మీనా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.నామినేషన్ల స్వీకరణకు అవసరమైన స్టేషనరీ, రిజిస్టర్లు, రికార్డుల ఏర్పాట్లపై ఆరా తీశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ఎన్నికల నామినేషన్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. నామినేషన్ కేంద్రం వద్ద పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని, రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అభ్యర్థులు, వారి ప్రతినిధుల రాకపోకలపై ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది సమన్వయంతో అప్రమత్తంగా పనిచేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలను పర్యవేక్షించాలని సూచించారు. ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఓఎస్డీ (అడ్మిన్) నవజ్యోతి మిశ్రా ఐపీఎస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా రైతు దినోత్సవం



**మార్కాపురం పెన్ పవర్ అక్టోబర్ 15**

మార్కాపురం జిల్లా వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా రైతు దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ హాల్ లో జరిగిన కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి డి. బాలాజీ నాయక్ అధ్యక్షత వహించారు. వ్యవసాయంలో మహిళా రైతుల ప్రాముఖ్యత, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టెక్నికల్ అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రసన్న రంగలక్ష్మి మాట్లాడుతూ, విత్తనం నాటడం నుంచి పంట కోత వరకు మహిళా రైతుల శ్రమ వెలకట్టలేనిదని, విత్తన శుద్ధి ఆవశ్యకతను వివరించారు. మార్కాపురం మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ డ్రోన్ స్ప్రేయర్ల వంటి ఆధునిక పద్ధతుల్లో మహిళా రైతులు నైపుణ్యం సాధించాలని సూచించారు.ఆత్మ సిబ్బంది ఎస్. దివ్యభారతి మాట్లాడుతూ, ప్రతి మహిళా రైతు వ్యవసాయ ఆధారిత వ్యాపారవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. యర్రగొండపాలెం రైతు యు. అరుణ ఆగ్రో ఇండస్ట్రీ, పెద్దరికట్ల రైతు సుజాత విశ్వమాత ప్రకృతి వ్యవసాయ ఫామ్ లను ఉదాహరణగా చూపారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి బాలాజీ నాయక్ పలువురు మహిళా రైతులకు కూరగాయ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు కె. బుజ్జి బాయి, పి. జ్యోష్ణదేవి, ఎన్. లక్ష్మీనారాయణ, దేవేంద్రగౌడ్, మనోహర్, ఏఈఓ శివగంగ ప్రసాద్, సబ్ డివిజన్ మహిళా రైతులు పాల్గొన్నారు.

# కూరాకు వానిపల్లెలో ట్రాన్స్ఫార్మర్ తగిలిపాడి గేదె మృతి

## ట్రాన్స్ఫార్మర్ వద్ద మేత మేత మేస్తుండగా ప్రమాదం.

## ఆ గ్రామానికి చెందిన పాణ్యం లక్ష్మీదేవి చెందిన లక్ష రూపాయల విలువ చేసే గేదె మృతి.

**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 15.**

కొమరోలు మండలం చింతలపల్లి పంచాయతీలోని కూరాకు వానిపల్లె గ్రామ పొలాల్లో గురువారం సాయంత్రం మేతకు వెళ్లిన పాడి గేదె పొలంలో గల విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ తగిలి మృతిచెందిన సంఘటన జరిగింది. ఆ గ్రామానికి చెందిన పాణ్యం లక్ష్మీదేవికి చెందిన పాడి గేదె గురువారం మేతకై పొలం వెళ్ళింది. పొలంలో దిమ్మెపై గల త్రీఫేస్ ట్రాన్స్ఫార్మర్ చుట్టూ గల పచ్చ గడ్డిని మేస్తుండగా పొరపాటున గేదె తలపైకి ఎత్తడంతో తలకు ట్రాన్స్ఫార్మర్ తీగలు తగిలాయి. దీనితో గేదె విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. లక్ష రూపాయలు వెచ్చించి పాడి గేదెను కొన్నామని, పాడి గేదె ఇచ్చే పాలతో వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నామని, అయితే లక్ష రూపాయలు విలువ చేసే పాడి గేదె విద్యుత్ షాక్ కు గురై మృతి చెందడంతో తాము తీవ్రంగా నష్టపోయామని గేదె యజమాని పాణ్యం లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేసింది. తనకు నష్టపరిహారం చెల్లించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని పాణ్యం లక్ష్మీదేవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నది.చింతలపల్లి జేఎల్ఎం రాజబాబు ఇచ్చిన సమాచారం మేరకు తాము లైన్ ఇన్స్పెక్టర్, లైన్ మెన్ తో కలసి కూరాకు వాని పల్లె పొలాలకు వెళ్లి ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని, మృతి చెందిన గేదెను పరిశీలించామని కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్తు



ట్రాన్స్ఫార్మర్ తగిలి గేదె మృతి చెందిన సంఘటనపై నివేదిక ఉన్నతాధికారులకు పంపించనున్నట్లుగా ఏ శ్రీనివాసులు తెలిపారు.

# మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 15**

మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, అక్రమ రవాణా నివారణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా గిద్దలూరు-- తాటిచెర్లమోటు రహదారిలో పద్మావతి నగర్ సమీపంలోని కొత్తపట్నం రెస్టారెంట్ దగ్గర హైవేపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి వాహనాల తనిఖీలను నిర్దేశిత విధివిధానాలు, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలు లేదా ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించిన పక్షంలో, సంబంధిత వివరాలను నమోదు చేసి, నిబంధనల ప్రకారం తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తత, నిష్పక్షపాత వైఖరి, పారదర్శకత పాటిస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, అమల్లో ఉన్న చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ఈ తనిఖీలో (అడ్మిన్) నవజ్యోతి మిశ్రా, మార్కాపురం డీఎస్పీ నిమ్మగడ్డ సత్యనారాయణ పాల్గొని సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.

# భారీ వర్షాలకు డి జి పేటలో పొంగిపొర్లిన గుండపు వాగు

## వర్షాలతో అన్నదాతల్లో చిగురించిన ఆశలు



**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 15**

మండల కేంద్రంలోని డి జి పేట గ్రామంలోని కొండలపై గురువారం కురిసిన భారీ వర్షాలకు గుండపు వాగు పొంగి పొర్లడంతో గ్రామస్తులు, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా ఎలినినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవక పంటల సాగుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు తాజా వర్షాలు కొంత ఊరటనిచ్చాయి.వర్షాభావ పరిస్థితులతో పంటల సాగు ఎలా సాగుతుందోనని ఆందోళన చెందుతున్న అన్నదాతలకు గుండపు వాగులో నీటి ప్రవాహం కొత్త ఆశలను కలిగించింది. వాగు పొంగి ప్రవహిస్తుండటంతో పరిసర ప్రాంతాల్లో వ్యవసాయానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే భూముల్లో తేమ పెరిగి పంటల సాగుకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని పేర్కొంటున్నారు.సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఇప్పటికే పలు ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం కురిసిన భారీ వర్షం ఉపశమనం కలిగించింది. గుండపు వాగులో నీరు ప్రవహిస్తుండటంతో భూగర్భ జలాలు పెరిగి బావులు, బోర్లలో నీటి లభ్యత మెరుగుపడుతుందని రైతులు ఆశిస్తున్నారు. రానున్న రోజుల్లోనూ వర్షాలు కురిసి పంటల సాగుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా, పంటలు సమృద్ధిగా పండాలని అన్నదాతలు ఆకాంక్షిస్తున్నారు.

# లలిత త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చిన పెద్దమ్మ తల్లి



**సి.ఎస్.పురం,పెన్ పవర్ అక్టోబరు 15**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని వి.ఆర్. నగర్ లో వెలసిన శ్రీ రాచూరి పెద్దమ్మ తల్లి దేవస్థానంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఐదవ రోజు అమ్మవారిని లలిత త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, పట్టు వస్త్రాలు, వివిధ రకాల పూలమాలలతో విశేషంగా అలంకరించారు. అనంతరం కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారిని లలిత త్రిపుర సుందరీ దేవిగా భక్తులు దర్శించుకున్నారు శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు.

# బ్యాలెట్ పత్రాల ప్రచురణకు సిద్ధంగా ఉండాలి

## - సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగా గుర్తించి భద్రతా చర్యలు చేపట్టాలి - జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశం

**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ అక్టోబర్ 15**

పురపాలక ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పత్రాల ప్రచురణకు సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై మున్సిపల్ కమిషనర్లతో గురువారం స్థానిక ప్రకాశం భవనంలోని వీక్షణ సమావేశ మందిరంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్స్ లను సమకూర్చుకోవాలని కలెక్టర్ చెప్పారు. పురపాలక ఎన్నికలకు ముందే అవసరమైన ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక, తీవ్ర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందస్తుగా గుర్తించి భద్రతా చర్యలకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వివరాలను కలెక్టరేట్ కు సమాచారం అందించాలన్నారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేయాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు భద్రంగా ఉంచడానికి స్ట్రాంగ్ రూమ్ లు, కౌంటింగ్ సెంటర్ లను గుర్తించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్ లను గుర్తించాలన్నారు. పురపాలక సంఘాల వారీగా రూపొందించిన ముందస్తు ప్రణాళికలపై నివేదించాలన్నారు. ఈ



సమావేశంలో జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, డి ఆర్ ఓ పి.వెంకటరమణ, జడ్పీ సీఈవో చిరంజీవి, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ తుమ్మల వెంకట కృష్ణయ్య, తదితర మున్సిపాలిటీల కమిషనర్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీహెచ్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# పేస్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహనా కార్యక్రమం

## - రాష్ట్రీయ ఏక్తా దివస్ - 2026, జాతీయ మోటార్ సైకిల్ ర్యాలీకి ప్రకాశం జిల్లా పోలీసులు - ఈగల్ సిబ్బంది ఘన స్వాగతం

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 15**

ఐజీపీ, ఈగల్ విభాగం వారి ఆదేశాల మేరకు, జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన బైక్ ర్యాలీలో పాల్గొంటున్న సీఆర్‌పీఎఫ్ బృందం సమన్వయంతో, గుంటూరు రేంజ్, ప్రకాశం జిల్లా ఈగల్ సెల్స్ సంయుక్తంగా టంగుటూరు మండలం, వల్లూరులోని పేస్ కళాశాలలో సమగ్ర మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. పెరుగుతున్న మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే ముప్పు, శారీరక, మానసిక ఆరోగ్యంపై వాటి దుష్ప్రభావాలు, సామాజిక, చట్టపరమైన పరిణామాలు, యువతలో మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని నివారించాల్సిన ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం యొక్క వివిధ రూపాలు, మత్తు కలిగించే మరియు మానసిక స్థితిపై ప్రభావం చూపే పదార్థాల దుర్వినియోగ పద్ధతుల గురించి విద్యార్థులకు వివరించారు. వ్యసనపదార్థాల వినియోగం వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక శ్రేయస్సు, విద్యాభ్యాసం, కుటుంబ సంబంధాలు, భవిష్యత్తులో వృత్తిపరమైన అవకాశాలపై కలిగే దుష్పరిణామాలను తెలియజేశారు. ముఖ్యంగా, యువత తోటివారి ఒత్తిడి, ఉత్సుకత, తప్పుదారి పట్టించే ప్రభావాల వల్ల మాదకద్రవ్యాల దుర్వినియోగానికి గురయ్యే ప్రమాదం ఉందని వివరించారు. మాదకద్రవ్యాల వినియోగానికి దారితీసే పరిస్థితులను గుర్తించి, వాటికి దూరంగా ఉండటం, తోటివారి ఒత్తిడిని ధైర్యంగా ఎదుర్కోవడం, ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని




అలవర్చుకోవడం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. వ్యసనపదార్థాలతో ప్రయోగాలు చేయవద్దని, మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలు ఎదురైనా లేదా వాటిని వినియోగించమని ఎవరైనా ఒత్తిడి చేసినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా ఇతర బాధ్యతగల వ్యక్తుల సలహా తీసుకోవాలని సూచించారు. అంతే కాకుండా, మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని వివరించారు. తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు మరియు సమాజంలో మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాలను వ్యాప్తి చేయడంలో విద్యార్థులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అప్రమత్తంగా ఉంటూ, మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాను అరికట్టడంలో చట్ట అమలు సంస్థలకు సహకరించాలని ప్రోత్సహించారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో ఈగల్ బృందాలు, సిఆర్పీఎఫ్ సిబ్బంది, విద్యాసంస్థలు, ప్రజల మధ్య సమన్వయం ఎంతో అవసరమని ఈ కార్యక్రమం ద్వారా వివరించారు. బైక్ ర్యాలీలో సిఆర్పీఎస్ బృందం పాల్గొనడం ఈ అవగాహన కార్యక్రమానికి మరింత ప్రాధాన్యతను చేకూర్చింది. మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని నివారించేందుకు చట్ట అమలు సంస్థలు సమిష్టిగా చేస్తున్న కృషిని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, తమ ఆరోగ్యాన్ని, భవిష్యత్తును కాపాడుకోవాలని, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిస్తూ కార్యక్రమాన్ని ముగించారు. రాష్ట్రీయ ఏక్తా దివస్ -- 2026 సందర్భంగా దేశ ఐక్యత, సమగ్రతను చాటుతూ సీఆర్‌పీఎఫ్ సిబ్బంది అక్టోబర్ 10 నుండి 26 వరకు అండమాన్ నికోబార్ దీవుల నుంచి గుజరాత్ వరకు జాతీయ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ ర్యాలీ ప్రకాశం జిల్లాకు చేరుకున్న సందర్భంగా, ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఆదేశాల మేరకు ఏఆర్ అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాసరావు, ఈగల్ బృందం సిబ్బంది ర్యాలీలో పాల్గొన్న వారికి డీటీసీ వద్ద ఘన స్వాగతం పలికారు.

## అనుమతులు తీసుకున్న తర్వాతే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి: కమిషనర్ రమణబాబు



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 15**

గిద్దలూరు: మున్సిపాలిటీ పరిధిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే వ్యాపార, వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా మున్సిపల్ అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని కమిషనర్ ఈ.వి. రమణబాబు తెలిపారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించి ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా, నిబంధనలు పాటిస్తూ మున్సిపాలిటీకి సహకరించాలని కమిషనర్ సూచించారు.

# శతమానం భవతు...

## కోలాహలంగా ఎంపీ మాగుంట జన్మదిన వేడుకలు

**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 15**

ఒంగోలులో రాంనగర్ 2 వ లైనులో మాగుంట కార్యాలయంలో మాగుంట అభిమానులు నిర్వహించిన జన్మదిన వేడుకలు అట్టహాసంగా.. అత్యంత వైభవంగా జరిగాయి. మాగుంట కుటుంబ అభిమానులు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు భారీగా పాల్గొనడంతో మాగుంట కార్యాలయం పరిసరాలు కోలాహలంగా మారాయి. మాగుంట అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ ను శ్రీనివాసులు రెడ్డి కట్ చేసి అభిమానులకు తినిపించారు. పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన పాట కచేరి ఆసాంతం అలరించింది. అలాగే పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడానికి మాగుంట కార్యాలయం చేరిన వేలాదిమంది అభిమానులకు కమ్మని విందును మాగుంట అభిమానులు ఏర్పాటు చేశారు. ఈ పుట్టినరోజు వేడుకల్లో శ్రీనివాసులు రెడ్డి తనయులు మాగుంట రాఘవ రెడ్డి , మాగుంట నిఖిల్ బాబు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు , కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివ రావు , సంతనూతలపాడు శాసనసభ్యులు బి. ఎన్. విజయ్ కుమార్ , కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వర రావు, సిద్దా సుధీర్, తాతా ప్రసాద్, కుప్పా రంగసాయి, అయినాబత్తిన ఘనశ్యామ్, ఆత్మకూరి బ్రహ్మయ్య, బెల్లం సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు అభిమానులు.




# పామూరుపల్లి గ్రామంలో ఉద్యానవన రైతుల నుండి 70 దరఖాస్తుల స్వీకరణ

### గ్లోబల్ హార్టికల్చర్ హబ్ వారోత్సవాలను పురస్కరించుకొని దరఖాస్తులు స్వీకరణ.

### గ్లోబల్ హార్టికల్చర్ హబ్ వారోత్సవాల వివరాలు వెల్లడించిన గిద్దలూరు ఉద్యానవన అధికారిని డి. శ్వేత.

**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 14**

అక్టోబర్ 12 నుండి 17వ తేదీ వరకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా గిద్దలూరు ఉద్యానవన అధికారిని డి శ్వేత తెలిపారు. వారోత్సవాలలో భాగంగా బుధవారం కొమరోలు మండలంలోని పామూరుపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన ఉద్యాన రైతుల నుండి వివిధ ఉద్యాన పథకాలకు సంబంధించి దరఖాస్తులను ఆమె స్వీకరించారు. గిద్దలూరు ఉద్యాన శాఖ అధికారి డి. స్వేత పామూరు పల్లె గ్రామాన్ని సందర్శించి, ఉద్యాన రైతుల అవసరాలను తెలుసుకొని, హైబ్రిడ్ కూరగాయల సాగు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, బొప్పాయి, అరటి సాగు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 70 దరఖాస్తులను సేకరించారు.ఆ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ, గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమం ద్వారా ఉద్యాన పంటల విస్తీర్ణం పెంపు, ఆధునిక సాగు పద్ధతుల ప్రోత్సాహం, వ్యవసాయ యాంత్రీకరణ, సూక్ష్మ సేద్యం, పంట కోత అనంతర యాజమాన్యం, ప్రాసెసింగ్ యూనిట్లు మరియు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఆమె వివరించారు.అక్టోబర్ 12 నుండి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ వారోత్సవాలను ఉద్యాన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఉద్యాన పంటల సాగుకు సంబంధించి మొక్కలు, యంత్ర పరికరాలు, డ్రిప్ ఇరిగేషన్, విస్తీర్ణం పెంపు, ప్రాసెసింగ్ యూనిట్లు లేదా ఇతర ఉద్యాన శాఖ పథకాల ద్వారా



సహాయం అవసరమైన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలను సందర్శించి దరఖాస్తులను సమర్పించాలని శ్వేత సూచించారు.రైతుల నుండి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో నమోదు చేసి, సంబంధిత పథకాల మార్గదర్శకాలు మరియు అర్హతల ప్రకారం తదుపరి పరిశీలన, చర్యల కోసం పంపించడం జరుగుతుందని ఆమె తెలిపారు.కావున ఉద్యాన రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని, తమకు అవసరమైన ఉద్యాన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అక్టోబర్ 17వ తేదీలోపు సమీప రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించాలని గిద్దలూరు ఉద్యాన శాఖ అధికారిని డి శ్వేత కోరారు.

# మునిసిపల్ ఎన్నికలకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలి

### ఎన్నికలకు సంబంధించిన రిసెప్షన్..డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ఏర్పాటు కోసం క్విస్..

### రైజ్ ఇంజనీరింగ్ కళాశాలల భవనాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజాబాబు



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ అక్టోబర్ 15**

మున ఎన్నికలకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. మునిసిపల్ ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ల ఏర్పాటు కొరకు నగరంలోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాల, రైజ్ ఇంజినీరింగ్ కళాశాల భవన సముదాయాలను జిల్లా కలెక్టర్, ఎస్పీలు కలిసి గురువారం పరిశీలించారు. పురపాలక సంఘాల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్స్ ను జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోనే ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లు ఉండాలన్నారు. అదే మాదిరిగా స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్లు ఎన్నికల కమిషన్ సూచించినట్లుగానే ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు పక్కాగా పాటించాలని పలు సూచనలు చేశారు. పటిష్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్లో ఉండేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు తూచాతప్పకుండా పాటించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, డి ఆర్ ఓ పి.వెంకటరమణ, జడ్పీ సీఈవో చిరంజీవి, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ తుమ్మల వెంకట కృష్ణయ్య, తదితర మున్సిపాలిటీల కమిషనర్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీహెచ్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# సంతమాగులూరు మండలంలో సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు ఖరారు

**సంతమాగులూరు, పెన్ పవర్, అక్టోబర్ 15**

సంతమాగులూరు మండలంలో 2026 రెండో సాధారణ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేశారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీలకు కేటాయించిన రిజర్వేషన్ల వివరాలతో కూడిన అనుబంధ జాబితాను విడుదల చేశారు. గ్రామాల వారీగా రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి. అడవిపాలెం -- జనరల్ మహిళ, బండివారిపాలెం -- ఎస్సీ, చవిటిపాలెం -- జనరల్ మహిళ, ఏల్చూరు -- బీసీ మహిళ, గురిజేపల్లి -- ఎస్సీ, కామేపల్లి -- జనరల్, కొమ్మాలపాడు -- జనరల్, కొప్పరం -- బీసీ, కుందుర్రు -- జనరల్ మహిళ, మక్కెనవారిపాలెం -- బీసీ, మామిళ్లపల్లి -- జనరల్, మిన్నెకల్లు -- జనరల్ మహిళ, పరిటాలవారిపాలెం -- బీసీ మహిళ, పాతమాగులూరు -- జనరల్, పట్టెపురం -- ఎస్టీ, పుట్టవారిపాలెం -- బీసీ మహిళ, సజ్జాపురం -- జనరల్, సంతమాగులూరు -- జనరల్ మహిళ, తంగేడుమల్లి -- ఎస్సీ మహిళ, వెల్లలచెరువు -- ఎస్సీ మహిళగా రిజర్వేషన్లు ఖరారయ్యాయి.రిజర్వేషన్ల ఖరారుతో ఆయా గ్రామాల్లో సర్పంచ్ పదవులను ఆశిస్తున్న అభ్యర్థులు తమ రాజకీయ సమీకరణాలకు పదును పెట్టే అవకాశం ఉంది. గ్రామాల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు రిజర్వేషన్లకు అనుగుణంగా తమ ప్రయత్నాలను ముమ్మరం చేయనున్నారు.

## ఒంగోలు ఎంపీ మాగుంటకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దేశం నాయకులు





పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 15,

ఒంగోలు పార్లమెంటు సభ్యులు మా గుంట శ్రీనివాస్ రెడ్డికి పొదిలి తెలుగుదేశం నాయకులు ఘనంగా తమ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం నాడు పొదిలికి చెందిన పలువురు దేశం నాయకులు ఒంగోలులోని మాగుంట శ్రీనివాసరెడ్డి ని కలసి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మా గుంటకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో బెల్లంకొండ విద్యాసంస్థల అధినేత బెల్లంకొండ శ్రీనివాసరావు, రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి వరికుంట్ల అనిల్, జిల్లా టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి షేక్. గౌస్ బాషా, తెలుగుదేశం నాయకులు ఉలవ గోపి, షేక్ మౌలాలి, హనీమూన్ శ్రీనివాసరెడ్డి, మీగడ ఓబుల్ రెడ్డి, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

## శ్రీ కాశి అన్నపూర్ణేశ్వరిగా శ్రీఈశ్వరాంబ



**దొనకొండ అక్టోబర్ 15 పెన్ పవర్**

మన మండల కేంద్రంలోని విరాట్ నగర్ లో గల శ్రీ ఆనంద ఆశ్రమంలో దసరా మహోత్సవంలో భాగంగా ఆనంద ఆశ్రమంలో ఐదవ రోజు శ్రీ కాశి అన్నపూర్ణేశ్వరిగా దర్శనమిచ్చారు ఉదయం 6 గంటల నుండి అమ్మవారికి విశేషఅభిషేకాలు ప్రత్యేక అలంకరణ చేసి అమ్మవారికి అష్టోత్తర శతనామావళి సహస్రనామార్చన సామూహిక కుంకుమ పూజ నిర్వహించి పులిహోర పొంగలి దద్దోజనం పంచభక్ష పరమాన్నాలు నైవేద్యాలు సమర్పించి మహిళలచే సామూహిక హారతులు ఇచ్చారు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంనారు వచ్చిన భక్తులకు ఆశ్రమ అర్చకులు మణి బాబు శర్మ తీర్థ ప్రసాదములు అంద చేశారు ఉభయ దాతలు నరసింహనాయినపల్లి వాస్తవ్యులు ఎర్రమరెడ్డి పిచ్చిరెడ్డి రమాదేవి దంపతులు వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు ఆరవ రోజు మూలా నక్షత్రం జ్ఞాన సరస్వతి దేవిగా శ్రీ ఈశ్వరీమహాదేవి దర్శనమిస్తుందని శ్రీ భైరవానంద స్వామి తెలియజేశారు.

## కలాంకు నివాళులర్పించిన ఎమ్మెల్యే ఇంటూరి




**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 15:**

మాజీ రాష్ట్రపతి, భారతరత్న, స్వర్గీయ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 95 వ జయంతిని కందుకూరు టిడిపి కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దేశం గర్వించేలా శాస్త్రవేత్తగా అనేక సేవలు అందించారని, రాష్ట్రపతి పదవికి కూడా వన్నెతెచ్చారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఖాదర్ బాషా, నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా, ఫిరోజ్, ఖాదర్, వార్డు అధ్యక్షులు గౌస్ బాషా, నాయక్ రసూల్, నజీర్, ఆల్ బాషా, మైనారిటీ నాయకులు జియావుద్దీన్, నాయబ్ రసూల్, వలీబాషా, కాలేషా, అర్షద్, గౌస్ బాషా, రెహమాన్, ఖుద్దూస్, సయ్యద్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

# నర సింహ అలంకారంలో గోవిధుడు

**శరాఫ్ బజార్లో వైభవంగా దసారా బ్రహోత్సవాలు**

**ఆధ్యాత్మిక శోభలో శరాఫ్ బజార్**



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్15**

గిద్దలూరు పట్టణంలో ని శరాఫ్ బజార్లో వెలసిన శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రీ వారు నరసింహా అలంకారం లో భక్తుల కు దర్శనం ఇచ్చారు. ఉదయాన్నే స్వామీ వారికి అభిషేకం , సుప్రభాత సేవలో వేద పారాయనం అంతరం నరసింహా అలంకారంలో స్వామి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయం నిత్యకణం పచ్చుతోరణం తో ఆలయం అలరారుతుంది. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిట లాడింది. రంగుల విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకారించారు. వేదపండితులు వేద పారాయణం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు తోటపల్లి చంద్రశేఖర్ శాస్త్రి శ్రీవారి కి అలంకారాలు నిర్వహిస్తున్నారు. భక్తుల కు తీర్ధ ప్రసాదాల నొసంగారు. ఆలయ కమిటీ అధ్యక్షులు గంజి వీరయ్య , ఉపాధ్యక్షులు పెద్దయ్య కార్యదర్శి కంచర్ల శ్రీనివాసులు కార్యక్రమల పర్యవేక్షించారు.

# బల్లికురవ మండలంలో సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు ఖరారు

**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, అక్టోబర్ 15**

బాపట్ల జిల్లా బల్లికురవ మండలంలో 2026 రెండో సాధారణ ఎన్నికలకు సంబంధించి 21 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేశారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి, అద్దంకి రెవెన్యూ డివిజనల్ అధికారి సంయుక్తంగా రిజర్వేషన్ల అధికారిక జాబితాను విడుదల చేశారు. మండలంలోని బల్లికురవ, గొర్రెపాడు, కె.వి.పాలెం, కొత్తూరు, పి.అంబాడిపూడి, వెలమవారిపాలెం గ్రామ పంచాయతీలను జనరల్ మహిళలకు కేటాయించారు. గుంటుపల్లి, కె.రాజుపాలెం, ఎస్.ఎల్.గుడిపాడు, ఉప్పుమాగులూరు, వైదన గ్రామ పంచాయతీలు జనరల్ కేటగిరీలో ఉన్నాయి. కొనిదెన, ఎన్.బి.పాడు పంచాయతీలను బీసీలకు, వల్లపల్లి పంచాయతీని బీసీ మహిళకు కేటాయించారు. చెన్నుపల్లి, కొప్పెరపాడు, కొప్పెరపాలెం పంచాయతీలు ఎస్సీలకు కేటాయించగా, కూకట్లపల్లి, మల్లాయపాలెం, ముక్తేశ్వరం పంచాయతీలు ఎస్సీ మహిళలకు రిజర్వు చేశారు. వేమవరం పంచాయతీని ఎస్టీ కేటగిరీకి కేటాయించారు. మొత్తం 21 గ్రామ పంచాయతీల్లో జనరల్‌కు 5, జనరల్ మహిళలకు 6, ఎస్సీలకు 3, ఎస్సీ మహిళలకు 3, బీసీలకు 2, బీసీ మహిళకు 1, ఎస్టీకి 1 స్థానం కేటాయించారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలపై రాజకీయ నాయకులు, ఆశావహులు దృష్టి సారిస్తున్నారు.

# అబ్దుల్ కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

**హెచ్ఎం లక్కిపోగు ఆంటోనీ**

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 15**

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సి ఎస్ పురం (ఎస్టీ) ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్కీపోగు ఆంటోనీ అన్నారు. గురువారం శాస్త్రవేత్త, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం తన కృషి, పట్టుదల, క్రమశిక్షణతో దేశం గర్వించే గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగారని కొనియాడారు. భారత అంతరిక్ష, క్షిపణి సాంకేతిక రంగాల అభివృద్ధికి విశేష సేవలందించారని తెలిపారు. రాష్ట్రపతిగా దేశ ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారని పేర్కొన్నారు. కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, దేశభక్తి, సేవాభావం పెంపొందించుకోవడమే కలాంకు అందించే నిజమైన నివాళి అని అన్నారు.

# సి ఎస్ పురం పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎస్పి డి శ్రీనివాస్ రావు

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 15**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని సి ఎస్ పురం పోలీస్ స్టేషన్‌ను గురువారం కనిగిరి డీఎస్పీ డి. శ్రీనివాస్ రావు ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్ పరిసరాలు, రికార్డులు, పెండింగ్ కేసులు, ఎన్నికలకు సంబంధించిన రికార్డులు, పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పలు కీలక సూచనలు చేశారు. గత ఎన్నికల్లో ఘర్షణలు, వివాదాలు, కేసులు నమోదైన గ్రామాలు, పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. రౌడీషీటర్లు, పాత నేరస్తులు, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షించి అవసరమైన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి, చట్టప్రకారం పిఐఆర్ నమోదు, సంబంధిత రెవెన్యూ అధికారుల సమక్షంలో బైండోవర్ చర్యలు చేపట్టాలని, పెండింగ్ కేసులను



సమీక్షిస్తూ, దర్యాప్తును వేగవంతం చేసి, చట్టపరమైన ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు గ్రామ కానిస్టేబుళ్ల సహకారంతో గ్రామాల్లోని పాత వివాదాలు, భూవివాదాలు, రాజకీయ విభేదాలు, సున్నితమైన ప్రాంతాలు, ముఖ్యమైన వ్యక్తులకు సంబంధించిన శాంతిభద్రతల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించాలి. సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కాకుండా, ముందస్తు సమాచారంతో వాటిని గుర్తించి, చట్టప్రకారం నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకొని ఎన్నికల నియమావళి, చట్టాలను పాటిస్తూ, ప్రజలందరికీ సమాన భద్రత కల్పించి, ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని,ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ సందర్భంగా పామూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. వినోద్ కుమార్ కు, ఎస్ఐ పి. వెంకటేశ్వరరెడ్డికి ఎన్నికల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ముందస్తు చర్యలకు సంబంధించి పలు సూచనలు చేశారు.

# ఎరువుల విక్రయాల్లో పారదర్శకతకు ప్రత్యేక శిక్షణ




**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 15**

ఎరువుల విక్రయాల్లో పారదర్శకత పెంపొందించి, అర్హులైన రైతులకు సకాలంలో ఎరువులు అందించాలనే లక్ష్యంతో కందుకూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు షేక్ అబ్దుల్ రహీమ్ ఆధ్వర్యంలో ఎరువుల విక్రయ విధానాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ఎరువుల వ్యాపారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గుడ్లూరు మండల వ్యవసాయ అధికారి రవికుమార్ మాట్లాడుతూ, ఎరువుల విక్రయాల నిర్వహణలో నూతన విధానాలను అనుసరించడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. రైతులకు ఎరువులు సులభంగా అందించడంతో పాటు, విక్రయ నిబంధనలు పాటించడం, ఎరువులను సకాలంలో సరఫరా చేయడంపై అవగాహన కల్పించారు.ప్రకాశం జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎరువుల విక్రయాల నిర్వహణకు రూపొందించిన నూతన అనువర్తనం ద్వారా రైతుల నమోదు, భూమి వివరాల నమోదు, ధ్రువీకరణ, ఎరువుల ముందస్తు నమోదు, గుర్తింపు సంకేతం వినియోగం, విక్రయ కేంద్రాల ద్వారా ఎరువుల అమ్మకాలు, గత కొనుగోళ్ల వివరాల పరిశీలన, రైతు పాస్‌పుస్తకాల నిర్వహణ, సమస్యల పరిష్కారం వంటి అంశాలపై వివరించారు. ఎరువుల పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని, అర్హులైన రైతులకు ఎరువులు సకాలంలో అందేలా వ్యవసాయ శాఖ సిబ్బంది, ఎరువుల వ్యాపారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఉపవిభాగ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ఎరువుల వ్యాపారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గిద్దలూరు మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ , జిల్లా ఎన్నికల. అధికారి విజయ సునీత, ఎస్పీ పంకజ్ కుమార్ మీనా**

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 15**

గిద్దలూరు మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అక్టోబర్ 16, 17, 18 తేదీల్లో మూడు రోజులపాటు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. విజయ సునీత, జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా గిద్దలూరు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన స్టేషనరీ, రిజిస్టర్లు, ఇతర రికార్డులు అందుబాటులో ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, నామినేషన్ ప్రక్రియను ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద కట్టు దిట్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని, రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతిభద్రతలను



నిరంతరం పర్యవేక్షించాలన్నారు మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ విజయ సునీత తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు . ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఓఎస్డీ (అడ్మిన్) నవజ్యోతి మిశ్రా , గిద్దలూరు సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కమిషనర్ రమణబాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భైరవకోనలో వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు

**మోహిని దేవి అమ్మవారిగా దర్శనమిచ్చిన త్రిముఖ దుర్గాదేవి**



**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 15**

జిల్లాలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ పర్యాటక శైవక్షేత్రం భైరవకోనలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం నాలుగవ రోజు శ్రీ త్రిముఖ దుర్గాదేవి అమ్మవారు మోహిని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ముప్పాళ్ల శ్యామ్ సుందర్ రాజు, కార్యనిర్వహణాధికారి వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వేద మంత్రోచ్చారణల నడుమ కుంకుమార్చనలు, బిల్వార్చనలు, అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ వివిధ హోమాలు నిర్వహించారు. గణాధిపతి హోమంతో విఘ్నాలు తొలగి, చేపట్టిన కార్యాలు నిర్విఘ్నంగా సాగాలని గణపతిని ప్రార్థించడం సంప్రదాయమని పండితులు వివరించారు. హోమాల ద్వారా లోకశాంతి, ప్రజల సుఖసంతోషాలు, సకల శుభాలు కలగాలని భక్తులు ప్రార్థించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలలో ప్రధాన అర్చకులు కంబాలదిన్నె వెంకట నరసయ్య, అర్చకులు సుధాకర్ శర్మ, రామ్మూర్తి, కిషోర్, త్రిపుర భైరవేశ్వరానంద స్వామి, మహేష్ రెడ్డి, ముడియాల నారాయణరెడ్డి, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

**రెండు కోర్సుల్లో 30 చొప్పున సీట్లు.. ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలే తుది గడువు**




**మహబూబాబాద్, పెన్ పవర్, అక్టోబర్ 15**

మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డి.ఎం.ఎస్.టి., డి.ఇ.సి.జి. కోర్సుల్లో ఒక్కో కోర్సుకు 30 సీట్ల చొప్పున ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని స్పష్టం చేశారు. అర్హులైన అభ్యర్థులు తెలంగాణ పారామెడికల్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ ద్వారా అక్టోబర్ 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రతితో పాటు అసలు ధ్రువపత్రాలు, స్వయం ధ్రువీకరణ చేసిన ధ్రువపత్రాల నకళ్లతో కూడిన ఒక ప్రతిసెట్, రెండు పాస్‌పోర్టు పరిమాణం గల ఛాయాచిత్రాలు, రూ.100 నగదు రుసుమును జతపరిచి అదే గడువులోగా మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. దరఖాస్తులో తప్పుడు వివరాలు నమోదు చేసినా, అవసరమైన ధ్రువపత్రాలను జతచేయకపోయినా దరఖాస్తులను తిరస్కరిస్తామని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తు పత్రం, నిబంధనలు, ఇతర వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

# శ్రీ లలితా త్రిపుర సుందరిగా రెడ్డెమ్మ తల్లి దర్శనం



**గుర్రంకొండ, పెన్ పవర్, అక్టోబర్ 15**

అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం చెర్లోపల్లి గ్రామంలోని శ్రీ రెడ్డెమ్మ తల్లి ఆలయంలో దసరా శరన్నవరాత్రుల ఐదో రోజు అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు పంచామృత అభిషేకం, పుష్పాలంకరణ, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదం పంపిణీ చేశారు. హిమజ, ఈవూరి రెడ్డి శేఖర్ నాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆరో రోజు అమ్మవారు శ్రీ మహాచండీ దేవిగా దర్శనమివ్వనున్నట్లు ఆలయ చైర్మన్ లంకిపల్లి రాజన్న నాయుడు, ఈఓ మంజుల తెలిపారు.

# వల్లభనేని వంశీ 2.0.. మళ్లీ మొదలు పెట్టేసిన మాజీ ఎమ్మెల్యే!



**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:** వైసీపీ కీలకనేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ మళ్లీ తన పాత పంథాలో రాజకీయంగా దూకుడు చూపుతున్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీని విజయ తీరాలకు చేర్చే బాధ్యతను భుజానికెత్తుకున్న వంశీ వరుసగా కేడర్ తో సమావేశాలు నిర్వహిస్తూ ధైర్యం నూరుపోస్తున్నారు. ఈ క్రమంలో ఊడత ఊపులకు తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరన్నట్లుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. తనకు భయం లేదని, తన అనుచరులు కూడా భయపడొద్దు అంటూ వంశీ చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి.

స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో వంశీ వరుసగా కార్యకర్తలతో సమావేశం అవుతున్నారు. ఈ క్రమంలో ఆయన చేస్తున్న వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత ప్రభుత్వంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేయడం ద్వారా వంశీ కూటమి ప్రభుత్వానికి టార్గెట్ అయ్యారని చెబుతున్నారు. దీంతో కూటమి గెలిచిన వెంటనే ఆయన కొంత తగ్గినట్లు కనిపించినా, ప్రస్తుతం మళ్లీ పూర్తిస్థాయిలో రాజకీయాలు చేస్తూ తన దూకుడును కొనసాగిస్తున్నారని అంటున్నారు.

గన్నవరం నియోజకవర్గంలో వరుస కార్యక్రమాల్లో వంశీ చేస్తున్న వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. రెండు రోజుల క్రితం తనను లోపల వేసిన వాడిని లోపలికి పంపిన నాయకుడు తనతో ఉన్నాడని చెబుతూ తనకు అండదండగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఉన్నారని, ఆయన కోసం తాను తెగించి పనిచేస్తానని స్పష్టం చేసినట్లుగా భావిస్తున్నారు. ఇక తాజాగా కూడా మాజీ సీఎం జగన్ రెడ్డి గొప్పతనాన్ని చాటిచెబుతూ వంశీ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో పార్టీని పెట్టి అధికారంలోకి వచ్చిన నాయకులు ముగ్గురే ఉన్నారని చెబుతూ, ఆ ఘనత సాధించిన నేతలుగా ఎన్టీఆర్, కేసీఆర్, జగన్ రెడ్డి పేర్లను ప్రస్తావించారు.

తెలుగు రాష్ట్రాల్లో ఎందరో పార్టీలు పెట్టినా అధికారంలోకి రాలేకపోయారని, కానీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మాత్రం తన విస్తృత జనాకర్షణతో పార్టీని గెలిపించుకోగలిగారని వంశీ కొనియాడారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఇక ఇదే సమయంలో ఆయన బెదిరింపులకు లొంగేది లేదు అన్నట్లు చేసిన వ్యాఖ్యలు అగ్గిరాజేస్తున్నాయి. ఇప్పటికే పలు కేసుల ఎదుర్కొని, జైలుకు వెళ్లి వచ్చిన వంశీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ద్వారా కూటమి ప్రభుత్వాన్ని, ప్రభుత్వ పెద్దలను తన ట్రాప్ లోకి లాగే ప్రయత్నం చేస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తన విమర్శలకు సమాధానం చెప్పలేని విధంగా మాటల బాణాలు విసరడం ద్వారా ప్రజల్లో తన పట్ల సానుభూతి పెంచుకోవాలని వంశీ వ్యూహంగా ఉందని అంటున్నారు. ఒకవేళ కూటమి ప్రభుత్వం మళ్లీ కేసులు నమోదు చేయించి అరెస్టు చేసేందుకు ప్రయత్నించినా, అది తనకు అనుకూలంగా మారుతుందని ఆయన భావిస్తున్నట్లుగా కనిపిస్తోందని అంటున్నారు. లేనిపక్షంలో తన మాటలతో వైసీపీ కార్యకర్తల్లో ఉత్తేజం నింపి ప్రభుత్వంపై దూకుడుగా పోటీ చేసేందుకు పనికొస్తుందన్న ఆలోచన కూడా ఉండొచ్చని అంటున్నారు. మొత్తానికి మాజీ ఎమ్మెల్యే వల్లభనేని తాజా వ్యూహం రాజకీయంగా ఆసక్తి రేపుతోందని అంటున్నారు.

# మంత్రివర్గం రేసులో మహిళా నేత.. లక్కు చిక్కేనా ..!



**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:** బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇస్తున్న సీఎం చంద్రబాబు... స్థానిక సంస్థలే కాదు తన మంత్రివర్గంలోనూ బీసీలకు పెద్దపీట వేయాలని భావించారు. ఈ క్రమంలోనే బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు ఈ దఫా మంత్రులుగా అవకాశం కల్పించాలని ఇప్పటికే సమీక్షలు ప్రారంభించారు. అంతర్గతంగా పార్టీ సేకరించిన రిపోర్టులతో పాటు వ్యక్తిగతంగా చంద్రబాబు ఆయా జిల్లాల్లో పర్యటించినప్పుడు నాయకుల పనితీరును చూసి వేసుకున్న అంచనాలను కూడా ఇప్పుడు సమీక్షిస్తున్నారు. తద్వారా నాయకులను మంత్రులుగా ఎంపిక చేసే విషయంపై దృష్టి పెట్టారు.దీనిలో ప్రధానంగా మహిళలకు ఎక్కువగా అవకాశం ఇవ్వాలన్నది చంద్రబాబు ఆలోచనగా ఉంది. తద్వారా మహిళా ఓటు బ్యాంకు ను ఆకర్షించాలని చూస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రెండు కోట్ల మందికి పైగా మహిళా ఓటర్లు ఉన్నారు. వీరిలో మెజారిటీ భాగం బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే కావడం, ఆ వర్గం వైపు టిడిపి ఎక్కువగా ఆశలు పెట్టుకున్న నేపథ్యంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళ ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించాలని చంద్రబాబు ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలో తాజాగా ఒక మహిళ ఎమ్మెల్యే పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.ఆవిడే గుంటూరు కు చెందిన గళ్ళ మాధవి. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో తొలిసారి విజయం సాధించిన మాధవి ఇటు పార్టీ పరంగా అటు వ్యక్తిగతంగా కూడా దూసుకుపోతున్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం విషయంలో కానీ ప్రజలకు అందుబాటులో ఉండే విషయంలో కానీ మాధవి మంచి మార్కులు సంపాదించుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల కాలంలో ఆమెను పార్టీ పొలిట్ బ్యూరోలోకి కూడా తీసుకున్నారు. ప్రధానంగా వైసిపి నేతలపై విరుచుకు పడడంలో ఈ విధంగా కౌంటర్లు ఇవ్వడంలో కూడా మాధవి ముందున్నారన్నది పార్టీ వర్గాలు చెబుతున్న మాట.

ఈ క్రమంలోనే చంద్రబాబు సైతం ఆమె వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. రజక సామాజిక వర్గానికి చెందిన మాధవికి మంత్రివర్గంలో అవకాశం కల్పించే విషయంపై చంద్రబాబు పరిశీలిస్తున్నట్టుగా పార్టీ వర్గాల నుంచి అత్యంత విశ్వసనీయ సమాచారం వైరల్ గా మారింది. మాధవికి అన్ని అర్హతలు ఉన్నాయని, ఇటు ప్రజల్లోనూ అటు పార్టీలోనూ మంచి పేరు ఉందని సమస్యలపై స్పందిస్తున్నారని సమస్యల పరిష్కారంతోపాటు అభివృద్ధి పనులు చేపట్టడం అదేవిధంగా ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడంలోనూ మాధవి నిరంతరం కృషి చేస్తున్నారని చంద్రబాబు ప్రగాఢంగా విశ్వసిస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే బీసీ సామాజిక వర్గంలో మరింత ఇమేజ్ పెంచుకునేందుకు మాధవికి అవకాశం ఇవ్వాలన్న నిర్ణయం దిశగా చంద్రబాబు అడుగులు వేస్తున్నట్టు సీనియర్ నాయకుల మధ్య చర్చ సాగుతోంది. అదేవిధంగా ఈసారి రాయలసీమ నుంచి మరో మహిళను బీసీ సామాజిక కోటాలో మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక ఉత్తరాంధ్ర నుంచి కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన మరో మహిళను కూడా తీసుకుంటారని అంటున్నారు మరి ఏం జరుగుతుందనేది చూడాలి.

# రాష్ట్రపతి డిజిటల్ పేమెంట్.. సరస్ మేళాలో ద్రౌపది ముర్ము స్పెషల్ అట్రాక్షన్



**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:** సామాన్యుల నుంచి సంపన్నుల వరకు.. చిల్లర వ్యాపారి నుంచి పెద్ద పెద్ద మాల్స్ వరకు.. నేడు దేశంలో ఎక్కడ చూసినా 'యూపీఐ పేమెంట్లు' సర్వసాధారణమైపోయాయి. రూపాయి బిళ్ల అవసరం లేకుండా కేవలం ఒకే ఒక్క క్యూఆర్ కోడ్ స్కాన్ తో క్షణాల్లో చెల్లింపులు చేసే సాంకేతికత ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగమైంది. డిజిటల్ విప్లవంలో దేశ ప్రథమ పౌరురాలే స్వయంగా భాగస్వామ్యం కావడం విశేష ఆకర్షణగా నిలిచింది. విజయవాడలో జరుగుతున్న 'సరస్ మేళా'ను సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అక్కడ ఒక స్టాల్‌లో చీర కొనుగోలు చేసి, తన మొబైల్ ద్వారా యూపీఐ పద్ధతిలో నగదు చెల్లించి అందరినీ ఆశ్చర్యపరిచారు.

విజయవాడ వేదికగా జరుగుతున్న జాతీయ సరస్ మేళా ప్రదర్శనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను ఆమె ఆసక్తిగా పరిశీలించారు. అక్కడి హస్తకళలు, చేనేత వస్త్రాల ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే ఒక స్టాల్‌లో తనకు నచ్చిన చీరను కొనుగోలు చేశారు. బిల్లు చెల్లించే సమయాన తన మొబైల్ ఫోన్ తీసి క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేశారు. యూపీఐ ద్వారా క్షణాల్లో చెల్లింపులు పూర్తి చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు.దేశ సర్వోన్నత పీఠంలో ఉన్న రాష్ట్రపతి స్వయంగా డిజిటల్ పేమెంట్ చేయడం డిజిటల్ ఇండియా సాధిస్తున్న విజయానికి నిలువెత్తు నిదర్శనంగా చెబుతున్నారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఆర్బీఐ కలసి 2016 ఏప్రిల్ 11న యూపీఐ వ్యవస్థను ప్రారంభించాయి. కేవలం కొన్ని బ్యాంకులతో ప్రారంభమైన ఈ ప్లాట్‌ఫామ్ నేడు దేశ ఆర్థిక వ్యవస్థనే మార్చివేసిందని అంటున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరిగే మొత్తం డిజిటల్ రియల్-టైమ్ లావాదేవీలలో దాదాపు 50% వాటా మన దేశానిదే కావడం విశేషంగా చెబుతున్నారు. ప్రతి నెలా వందల కోట్ల లావాదేవీలు యూపీఐ ద్వారా జరుగుతున్నాయి. చిన్న వ్యాపారులు, కూరగాయల అమ్మకందారుల నుంచి పెద్ద వ్యాపారాల వరకు ప్రతి లావాదేవీ డిజిటల్ రూపంలోనే సాగుతోంది.

యూపీఐ సాంకేతికత ఇక్కడితో ఆగడం లేదు. రాబోయే రోజుల్లో ఇది మరింత సంచలనాత్మక మార్పులు తేనుందని చెబుతున్నారు. ఏఐ ఆధారిత వాయిస్ కమాండ్ల ద్వారా మాటలతోనే సులువుగా చెల్లింపులు చేసే

సదుపాయం రాబోతోందని నిపుణులు చెబుతున్నారు. సింగపూర్, యూఏఈ, ఫ్రాన్స్, శ్రీలంక వంటి అనేక దేశాల్లో ఇప్పటికే యూపీఐ అందుబాటులోకి రాగా, భవిష్యత్తులో ప్రపంచమంతటా భారతీయులు కరెన్సీ మార్పిడి లేకుండా నేరుగా చెల్లింపులు చేయవచ్చు. అలాగే ఇంటర్నెట్ లేని మారుమూల ప్రాంతాల్లోనూ ఫీచర్ ఫోన్ల ద్వారా నేరుగా లావాదేవీలు జరిపేలా సాంకేతికత విస్తరిస్తోంది. విజయవాడ మేళాలో రాష్ట్రపతి డిజిటల్ చెల్లింపు చేయడం నుంచి గ్రామీణ మహిళలు క్యూఆర్ కోడ్ స్కానర్లు వాడడం వరకు.. భారత్ ఎంత వేగంగా డిజిటల్ వైపు అడుగులు వేస్తోందో స్పష్టమవుతోంది. ఆర్థిక పారదర్శకతకు, సులువైన జీవనానికి యూపీఐ వేసిన బాట భవిష్యత్తులో భారత్‌ను మరింత బలమైన డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మార్చుతుందని అంటున్నారు.

# యార్లగడ్డ మాస్ రియాక్షన్.. గన్నవరం అప్పుడే గరం.. గరం..



**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:** స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రధానంగా కొన్ని కీలక నియోజకవర్గాల్లో ఈ వేడి మరింత ఎక్కువగా కనిపిస్తోంది. రాష్ట్ర రాజకీయ రాజధాని విజయవాడ నగరంలో అంతర్భాగమైన గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న రాజకీయాలు మరింత ఆసక్తిని కలిగిస్తున్నాయి. ఈ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలక నేత వల్లభనేని వంశీ కొద్దిరోజులుగా హడావుడి చేస్తుండగా, ఆయనకు కౌంటరుగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు రంగంలోకి దిగారు.స్థానిక ఎన్నికలకు వైసీపీ క్యాడర్ ను సన్నద్ధం చేసేందుకు వరుస సమావేశాలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తమ పార్టీ అధినేత జగన్మోహనరెడ్డికి హైప్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని చెబుతున్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు విషయాన్ని ఎత్తిచూపుతూ.. రెండు రోజుల క్రితం కీలక వ్యాఖ్యలు చేశారు. తనను లోపల వేసిన వారిని లోపలకు పంపిన వాడు తనతో ఉన్నాడంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అండదండలు ఉన్నాయని, తాను ఎవరికీ భయపడనని మాజీ ఎమ్మెల్యే వంశీ మాట్లాడిన వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే.ఇక వంశీ వ్యాఖ్యలపై గన్నవరం సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకటరావు తీవ్రస్థాయిలో రియాక్ట్ అయ్యారు. వంశీ వెనక ఉన్నారని చెబుతున్న వ్యక్తే.. గతంలో అతడిపై తనను పోటీపెట్టాడని, వంశీ అరాచకాలను ఎదిరించాలని గన్నవరం టికెట్ ఇచ్చి పోటీకి పెట్టారని గుర్తు చేశారు. "నీ వెనుక ఉన్నవాడికి నీ గురించి తెలుసు.. నా గురించి తెలుసు. 2018లో బ్రహ్మలింగయ్య చెరువు ఒడ్డుమీద నీ వెనుక ఉన్నాయనే మట్టికాసుడు. రావణాసుడు, భూ బకాసురుడు అన్ని చెప్పిన వీడియో ఇప్పటికీ యూట్యూబ్ లో ఉంది. ఇప్పుడు అవన్నీ మరచిపోయి సుద్దపూస కబుర్లు చెబుతున్నావు" అంటూ ఎమ్మెల్యే యార్లగడ్డ మండిపడ్డారు.మాజీ ఎమ్మెల్యే వంశీ అవినీతిపరుడు అని మాజీ సీఎం జగన్మోహనరెడ్డి తనను అమెరికా నుంచి తీసుకువచ్చి గన్నవరంలో పోటీ చేయమని కోరిన విషయం మరచిపోయావా? అంటూ ప్రశ్నించారు. బుద్ధి, జ్ఞానం లేకుండా నిర్లజ్జగా మాట్లాడుతున్నారని యార్లగడ్డ ఫైర్ అయ్యారు. ప్రస్తుతం యార్లగడ్డ రియాక్షన్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కృష్ణా జిల్లాలో ఉన్న గన్నవరం నియోజకవర్గం తొలి నుంచి టీడీపీకి కంచుకోటగా ఉంది. ఇక్కడి నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వంశీ గత ప్రభుత్వంలో వైసీపీలో చేరగా, అప్పుడు ఆయనపై వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన యార్లగడ్డ వెంకటరావు 2024 అసెంబ్లీ ఎన్నికల ముందు టీడీపీలో చేరారు.

ఇక ఈ ఇద్దరు గత ఎన్నికల్లో మరోసారి ప్రత్యర్థులుగా తలపడగా, యార్లగడ్డ వెంకటరావు రికార్డు మెజార్టీతో గెలిచారు. అదేసమయంలో అంతకుముందు ఎన్నికల్లో ప్రత్యర్థులుగా తలపడిన ఈ ఇద్దరు ఇప్పుడు తమ పార్టీలను పార్టీ అధినేతలను పొగుడుతూ ప్రత్యర్థి పార్టీల నేతలను విమర్శిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అప్పట్లో ఆయా పార్టీల అధినేతల మన్ననల కోసం పనిచేసిన నాయకులు ఇప్పుడు పార్టీలు మారి వారిపైనే విమర్శలు చేయడం ఆసక్తి రేపుతోంది. ఈ క్రమంలోనే గతంలో టీడీపీలో పనిచేసిన వంశీ అప్పట్లో తనను నెంబర్ వన్ ఎమ్మెల్యే అంటూ పొగిడేవారని చెప్పుకోగా, అప్పట్లో ఆయనపై మాజీ సీఎం జగన్ చేసిన విమర్శలను కూడా గుర్తుచేస్తూ ఎమ్మెల్యే వెంకటరావు చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీస్తున్నాయని చెబుతున్నారు.

# కూటమిలో కుంపటి.. టీడీపీకి జనసేన కొత్త టెన్షన్ పవన్ వ్యూహమేంటి?

**విజయవాడ అక్టోబరు 15 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన కూటమికి ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు కొత్త సవాళ్లు విసురుతున్నాయి. సీట్ల పంపకాల విషయంలో భాగస్వామ్యపక్షం జనసేన ఓ అడుగు ముందుకేసి దూకుడు పెంచింది. అసెంబ్లీ ఎన్నికల్లో 12శాతం సీట్లలో పోటీ చేసిన జనసేన ఇప్పుడు లోకల్‌బాడీల్లో 40శాతం సీట్లు కావాలని అడుగుతోంది. ఇది కేవలం ప్రచారం కాదు.. ప్రభుత్వంలో భాగంగా ఉన్న మంత్రులు, ఆ పార్టీ నేతలు బహిరంగంగానే మాకు కావాలసిన సీట్లు ఇన్నీ.. అని లెక్కలేసి మరీ ప్రకటించేశారు. పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ చేసిన ట్వీట్ కేవలం ఆయన అభిప్రాయంగా చెప్పలేం. అది కచ్చితంగా పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మాటనే. దుర్గేష్ జారీ చేసిన జాబితా చూస్తే.. జనసేన పక్కా వ్యూహంతోనే ఉన్నట్లుగా ఉంది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, వార్డుల స్థాయిలో మొత్తం స్థానాలను పరిగణనలోకి తీసుకుని.. సగటున 40 శాతం వాటాను జనసేన ప్రతిపాదిస్తున్నట్లుగా ఆ జాబితాలో చూపించారు. అందులో మేయర్లు, డిప్యూటీ మేయర్లు, స్టాండింగ్ కమిటీ పదవులు, వార్డు కౌన్సిలర్ల స్థానాలు కూడా ఉన్నాయి. 6 మేయర్ స్థానాలు, 6 డిప్యూటీ మేయర్ స్థానాలు, 44 మునిసిపల్ ఛైర్మన్లు, దాదాపు 2000 వార్డు మెంబర్లు కౌన్సిలర్ స్థానాలు వీరు కోరుతున్నారు.లోకల్ ఎన్నికలకు సంబంధించి టీడీపీకి అస్సలు ఊహలో కూడా లేని నెంబర్ ఇది. ప్రధాన పదవుల్లో 42శాతం, మొత్తం మీద 40శాతం పదవులను జనసేన అడుగుతోంది. ఇప్పుడు వీళ్లు ఇన్ని అడిగితే.. బీజేపీ కూడా అసెంబ్లీ ఎన్నికల వాటా కంటే కచ్చితంగా ఎక్కువగానే అడిగే అవకాశం ఉంది. దీనిని బట్టి సగం స్థానాలను టీడీపీ మిత్రపక్షాలకు వదలాల్సి ఉంది. దీనికి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారా..? టీడీపీ శ్రేణులు దీనికి సమ్మతిస్తాయా అన్నది అసలు ప్రశ్నజనసేన స్థానిక ఎన్నికల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని అంచనా వేసి అభ్యర్థుల ఎంపికకు సిద్ధమవడం చూస్తే.. ఈసారి సీట్ల పంపకాలను తేలిగ్గా వదిలేయడానికి ఆ పార్టీ సిద్ధంగా లేదని అర్థమవుతోంది. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సీట్ల సర్దుబాటు ఫార్ములానే స్థానిక ఎన్నికలకూ వర్తింపజేయలేమని జనసేన నేత నాదెండ్ల మనోహర్ చాన్నాళ్ల క్రితమే చెప్పారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేసి అద్భుతమైన ఫలితాలు సాధించాయి. ఆ విజయంలో మూడు పార్టీల పాత్ర ఉన్నప్పటికీ, అసెంబ్లీ స్థానాల పరంగా టీడీపీ ప్రధాన భాగస్వామిగా నిలిచింది. ఇప్పుడు స్థానిక ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి సమీకరణాలు మారుతున్నాయి. అప్పుడు జనసేనకు 12శాతం, బీజేపీకి 6శాతం సీట్లు ఇచ్చిన టీడీపీ 80కి పైగా స్థానాల్లో పోటీ చేసింది. అయితే అది ఇప్పుడు కుదరదు అని జనసేన తేల్చేసింది. టీడీపీపై ఒత్తిడి పెంచడానికి ముందు నుంచే ఎక్కువ సీట్లు కావాలని చెబుతోంది. ఇప్పటికే సీట్లు పంపకాలపై మూడు సార్లు సమావేశమైనప్పటికీ ఏ విషయం తేలలేదు. అంతేకాదు.. తమకు ఎన్నిసీట్లు కావాలో నేరుగా ఆన్‌లైన్‌లో పెట్టేయడం ద్వారా జనసేన ఇప్పుడు బాల్‌ను టీడీపీ కోర్టులోకి నెట్టేసింది. ఇప్పటి వరకూ కూటమిలో ఉన్న పొరపొచ్చాలను బయటకు రాకుండ సర్దుబాటు చేసుకుంటూ వస్తున్న చంద్రబాబుకు ఇది కచ్చితంగా కాస్త ఇబ్బంది కరమే..ప్రస్తుత పరిస్థితిని పవన్ కల్యాణ్ తనకు అనుకూలంగా మార్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. టీడీపీతో పొత్తు కారణంగా జనసేనకు అధికారంలో భాగస్వామ్యం లభించింది. కానీ స్థానిక సంస్థల్లోనూ పార్టీకి తగిన ప్రాతినిధ్యం లేకపోతే, కేడర్‌లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. అందుకే ఈసారి స్థానిక ఎన్నికలను జనసేన తన సంస్థాగత బలాన్ని పెంచుకునే అవకాశంగా దీనిని చూస్తుందనుకోవచ్చు. 40 శాతం వాటా ప్రతిపాదనపై కనుక ఆ పార్టీ సీరియస్‌గా నిలబడితే.. అది సాధారణ సీట్ల పంపకాల చర్చ కంటే పెద్ద రాజకీయ సంకేతమే అవుతుంది. లోకల్ బాడీ ఎన్నికల్లో పెద్ద వాటా తీసుకునేందుకే క్రమంగా జనసేన తమ నేరేటివ్‌ను బలపరుచుకుంటూ వచ్చింది. ముందుగా అంతర్గత కమిటీలు వేసి తమ పార్టీలో బలం ఎంత ఉంది.. ఎక్కడెక్కడ డిమాండ్ ఉందన్న విషయాన్ని చెప్పారు. ఆ తర్వాత నాదెండ్ల మనోహర్ తమ వైఖరి ఏంటో తెగ్గొట్టేశారు. ఇప్పుడు సరైన టైమ్‌లో "మాకు ఇన్నిసీట్లు కావాలి" అని తేల్చేశారు. పవన్ చాలా పకడ్బందీగా ఈ వ్యూహాన్ని అమలు చేసినట్లు కనిపిస్తోంది.పవన్ కల్యాణ్- లోకేష్ పరస్పరం ఎంత సఖ్యతతో ఉంటారన్నది చాలా సార్లు కనిపించింది. అయితే వారిద్దరి మధ్య వచ్చిన కమ్యూనికేషన్ గ్యాప్.. కూటమిలో కాస్త వేడిపుట్టించిందని సమాచారం. ఈ మధ్య కాలంలో పనవ్ కల్యాణ్ కూటమి నేతలతో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ప్రచారం, లోకేశ్‌తో దూరం పెరుగుతోందన్న చర్చలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నా.. వీటిని నిర్ధారించే స్పష్టమైన ఆధారాలు కనిపించడం లేదు. కానీ ఎక్కడో తేడా వచ్చిందనే మాటలైతే.. వినిపిస్తున్నాయి.

### విజయ్ పర్యటనలో పవన్ కల్యాణ్ మిస్సింగ్

తమిళనాడు ముఖ్యమంత్రిగా తొలిసారి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన విజయ్ పర్యటన రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. అయితే విజయ్ పర్యటనలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్కడా కనిపించకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. విజయ్ విజయవాడ టూర్ షెడ్యూల్ ఖరారైనప్పుడు .. ఆయన వ్యక్తిగతంగా పవన్‌తో భేటీ అవుతారని, లేదంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో జరిగే అధికారిక సమావేశంలో డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కల్యాణ్ పాల్గొంటారని జోరుగా ప్రచారం జరిగింది. తీరా చూస్తే, చంద్రబాబుతో జరిగిన జల చర్చల్లో గానీ, పున్నమి ఘాట్ వద్ద జరిగిన విజయవాడ ఉత్సవ్ 2.0 వేదికపై గానీ పవన్ అస్సలు కనిపించలేదు.పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చినప్పుడు.. అదీ సినిమా రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఒక స్టార్ లీడర్ ఏపీకి విచ్చేసిన వేళ, అదే సినీ నేపథ్యం, ప్రజాదరణ ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా అధికారిక కార్యక్రమాల్లో భాగస్వామి అయి ఉంటే హుందాగా ఉండేదన్న అభిప్రాయం సాధారణ ప్రజల్లో, అభిమానుల్లో వ్యక్తమైంది. పైగా విజయవాడ నడిబొడ్డున జరిగే సాంస్కృతిక వేడుకలకు ఉప ముఖ్యమంత్రి హాజరు కాకపోవడం వెనుక ఏదైనా ప్రోటోకాల్ సమస్య ఉందా లేక రాజకీయ కారణాలు ఉన్నాయా అన్న ప్రశ్నలు సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి. ఏపీ సర్కార్ తరఫున మున్సిపల్ మంత్రి నారాయణ, ఇతర అధికారులు ముందుండి కార్యక్రమాలను నడిపించారే తప్ప, పవన్ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు.పవన్ కల్యాణ్ ఈ పర్యటనకు కావాలనే దూరంగా ఉండటం వెనుక ఒక బలమైన రాజకీయ, ఆత్మగౌరవ కోణం దాగి ఉందని జనసేన వర్గాలు చెబుతున్నాయి.

## బుమ్రా స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు.. కానీ మా దగ్గర ప్రతిభ ఉంది: సంజూ శాంసన్

- బుమ్రా లాంటి బౌలర్‌కు ప్రత్యామ్నాయం లేదని చెప్పిన సంజూ శాంసన్
- యువ బౌలర్లు అర్ష్‌దీప్, ప్రిన్స్ యాదవ్‌లను ప్రశంసించిన వికెట్ కీపర్
- అద్భుతంగా ఆడుతున్న షాయ్ హోప్‌ను గౌరవించాల్సిందేనని వ్యాఖ్య
- తిలక్ వర్మ ఔట్ కావడమే మ్యాచ్‌లో కీలక మలుపు అని వెల్లడి
- ఓపెనర్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలకు మద్దతుగా నిలిచిన శాంసన్



హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో భారత జట్టు 24 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఈ ఓటమి అనంతరం వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశాడు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని, ఆయన లేని లోటు బౌలింగ్ విభాగంలో స్పష్టంగా కనిపిస్తోందని అంగీకరించాడు.ఆసియా క్రీడల తర్వాత వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై శాంసన్ మాట్లాడుతూ.. "జస్‌ప్రీత్ బుమ్రా ఒక తరం గర్వించదగ్గ బౌలర్. అలాంటి ఆటగాడు జట్టులో ఉండటం మన అదృష్టం. ఆయనకు ప్రత్యామ్నాయం ఉండదు. కానీ, మన జట్టులోకి మంచి ప్రతిభ ఉన్న యువ ఆటగాళు వస్తున్నారు. అర్ష్‌దీప్ సింగ్ అద్భుతంగా రాణిస్తున్నాడు. అలాగే గత కొన్ని మ్యాచ్‌లలో ప్రిన్స్ యాదవ్ కూడా ఆకట్టుకుంటున్నాడు. వారికి మనం ఎంత ఎక్కువ అవకాశాలు ఇచ్చి ప్రోత్సహిస్తే, వారు అంతగా రాటుదేలుతారు" అని వివరించాడు. బ్యాటింగ్ చేస్తూ గాయపడిన అర్ష్‌దీప్ గురించి మాట్లాడుతూ.. "అతను భుజానికి ఐస్ పెట్టుకుంటున్నాడు. త్వరగా కోలుకుంటాడని ఆశిస్తున్నాను" అని తెలిపాడు.వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ అద్భుత ఫామ్‌ను శాంసన్ ప్రశంసించాడు. "హోప్ చాలా బాగా ఆడుతున్నాడు. అతని ఆటను మనం గౌరవించాలి. పెద్దగా రిస్క్ తీసుకోకుండా, మంచి క్రికెటింగ్ షాట్లతో బౌలర్లను గౌరవిస్తూ పరుగులు చేస్తున్నాడు. అతడి బ్యాటింగ్‌కు కచ్చితంగా క్రెడిట్ ఇవ్వాలి. ప్రతి మ్యాచ్‌లో అతడిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై మేం దృష్టి సారిస్తున్నాం" అని పేర్కొన్నాడు.

ఈ మ్యాచ్‌లో ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తూ.. 17వ ఓవర్‌లో తిలక్ వర్మ ఔట్ కావడమే కీలక మలుపు అని శాంసన్ అభిప్రాయపడ్డాడు. "తిలక్ ఔట్ అయ్యే వరకు మేం లక్ష్య ఛేదనలో సరైన మార్గంలోనే ఉన్నాం. ఓవర్‌కు 10-12 పరుగులు సులభంగా రాబడుతున్నాం. ఒత్తిడిలోనూ నితీశ్ రెడ్డి, తిలక్ వర్మ అద్భుతంగా ఆడారు" అని కొనియాడాడు.

ఇదే సమయంలో ఫామ్ కోల్పోయిన ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలకు అండగా నిలిచాడు. "ఇషాన్, అభిషేక్ ప్రపంచంలోనే అత్యుత్తమ ఓపెనర్లు. ఒక మ్యాచ్‌లో విఫలమైనంత మాత్రాన ఆందోళన అవసరం లేదు. గత మ్యాచ్‌లోనే అభిషేక్ మంచి ఇన్నింగ్స్ ఆడాడు. ఇషాన్ నిలకడగా రాణిస్తున్నాడు" అని వారికి మద్దతుగా నిలిచాడు.

# ఈ చెత్త బౌలింగ్‌తో మనం వరల్డ్‌కప్ గెలవడం చాలా కష్టం.. మాజీ క్రికెటర్ వ్యాఖ్యలు వైరల్





హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20లో భారత జట్టు 24 పరుగుల తేడాతో ఓడిపోయిన సంగతి తెలిసిందే. విండీస్ నిర్దేశించిన 247 రన్స్ లక్ష్య ఛేదనలో టీమిండియా ఘోరంగా తడబడింది. ఈ నేపథ్యంలో ఇండియన్ బౌలర్ల ప్రదర్శనపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రస్తుత బౌలింగ్ కాంబినేషన్‌తో భారత్ ఐసీసీ ప్రపంచకప్ గెలవడం చానా కష్టమని తేల్చి చెప్పేశాడు.

**బౌలర్ల వైఫల్యమే భారత్ కొంపముంచింది:**

మాజీ క్రికెటర్ కైఫ్ మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ మ్యాచ్‌లో భారత్ ఓటమికి ప్రధాన కారణం బౌలింగ్ వైఫల్యమే.. బౌలర్లు భారీగా పరుగులు సమర్పించారు. 247 రన్స్ ఇవ్వడమంటే మాములు విషయం కాదు. ఇదే తొలిసారి కాదు, అంతకుముందు కూడా 250ం టార్గెట్‌ను కాపాడుకోవడంలో భారత బౌలర్లు ఘోరంగా విఫలమయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో బ్యాటర్లు 3 మ్యాచ్‌లు గెలిపిస్తే.. మిగతా రెండింటిని బౌలర్లు ఓడించారు. ఇలాంటి కాంబినేషన్‌తో ప్రపంచకప్ నెగ్గడం అసాధ్యం అని కైఫ్ హెచ్చరించారు.

**2024 ప్రపంచకప్ విజయంతో పోలిక:**

2024 టీ20 ప్రపంచకప్ విజయంలో జట్టులోని ప్రతి ఒక్కరూ భాగస్వామిగా నిలిచారు అని మహమ్మద్ కైఫ్ గుర్తు చేశారు. జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ లాంటి బౌలర్లతో పాటు బ్యాటర్లు సత్తా చాటారని పేర్కొన్నాడు. ఇక నాలుగో టీ20లో ఓపెనర్ అభిషేక్ శర్మ నెమ్మదిగా ఆడాడంటూ వస్తున్న విమర్శలపై స్పందిస్తూ.. ప్రతి బ్యాటర్ అన్ని రోజులూ అద్భుతంగా ఆడటం కష్టమని, సంజు శాంసన్ మాత్రం జట్టుకు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడని కైఫ్ అభిప్రాయపడ్డారు.

# యువ క్రికెటర్లను యువరాజ్ ఎలా తిట్టేవాడో తెలుసా.. పాత రోజులని గుర్తు చేసుకున్న రోహిత్



భారత క్రికెట్ చరిత్రలోనే డ్రెస్సింగ్ రూమ్ ముచ్చట్లు ఎప్పుడూ అత్యంత ఆసక్తికరంగా ఉంటాయి. భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' షో ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. సహచర ఆటగాళ్ల వ్యక్తిత్వాలపై హిట్‌మ్యాన్ చేసిన వ్యాఖ్యలు ఒకవైపు నవ్విస్తూనే, మరోవైపు భారత క్రికెట్‌లోని క్రమశిక్షణ, సీనియర్-జూనియర్ అనుబంధాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. ఇండియన్ ప్లేయర్స్ క్రికెటర్లు కాకపోయి ఉంటే ఏ ప్రొఫెషన్ సెలక్ట్ చేసుకునేవారనే ప్రశ్నకు రోహిత్ ఇచ్చిన ఆన్సర్ ఇప్పుడు ఫ్యాన్స్ ని ఆకట్టుకుంటుంది.

**జస్ప్రీత్ బుమ్రా డాక్టర్ అయ్యేవాడు:**

బాలీవుడ్ స్టార్ కమెడియన్ కృష్ణ అభిషేక్ అడిగిన ప్రశ్నకు రోహిత్ శర్మ స్పందిస్తూ.. ప్రపంచ నంబర్ వన్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. బుమ్రా గనుక క్రికెటర్ కాకపోతే ఖచ్చితంగా డాక్టర్ అయ్యేవాడని చెప్పాడు. మైదానంలో మ్యాచ్ చివర్లో చావు బతుకుల మధ్య పోరాడుతున్న సమయంలో, బౌలింగ్ కి వచ్చి ప్రత్యర్థి నుంచి మ్యాచ్‌ను కాపాడే ప్రాణదాతలా బుమ్రా నిలుస్తాడని కొనియాడాడు. ఆ ఒత్తిడిని జయించి మ్యాచ్‌ను గెలిపించడం అందరికీ సాధ్యమయ్యే పని కాదని హిట్ మ్యాన్ తేల్చి చెప్పాడు.

**యంగ్ క్రికెటర్లని యువీ ఘోరంగా తిట్టేవాడు:**

మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌ను రోహిత్ శర్మ 'హెడ్‌మాస్టర్' తో పోల్చాడు. 2006, 2007 కాలంలో తాము కొత్తగా జట్టులోకి వచ్చినప్పుడు యువీ భాయ్ ఒక కఠినమైన హెడ్‌మాస్టర్‌లా వ్యవహరించేవాడని గుర్తు చేసుకున్నాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో క్రమశిక్షణ విషయంలో జూనియర్లను బాగా తిట్టేవాడని, అయితే ఆ తిట్ల వెనుక ఎంతో ఆప్యాయత, ప్రేమ దాగి ఉండేవని పేర్కొన్నాడు. ఆరంభంలో సీనియర్లతో ఆడుతున్నప్పుడు ఉన్న భయం, బెరుకును పోగొట్టి, తమను పూర్తి కంఫర్టబుల్‌గా మార్చడంలో యువరాజ్ పాత్ర మరువలేనిదని రోహిత్ భావోద్వేగంగా చెప్పుకొచ్చాడు.ఇక రిషభ్ పంత్‌ను రోహిత్ పర్ఫెక్ట్ 'బేబీ సిట్టర్' గా అభివర్ణించాడు. విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఆటగాళ్ల కుటుంబాలు, పిల్లలు మాతో వచ్చేవాళ్లని.. ప్రాక్టీస్ పూర్తయిన వెంటనే పంత్ పిల్లలతో గడిపేవాడు. ఆస్ట్రేలియా పర్యటనలో అప్పటి కెప్టెన్ టిమ్ పైన్ 'బేబీ సిట్టర్' అని పిలవడానికి అసలు ముచ్చట ఇదే.. అయితే పిల్లలతో అంత ప్రేమగా ఆడుకుంటూనే, సరదాగా వారి ప్లేట్లలోని ఫుడ్ లాక్కుని తినేసేవాడని, దాంతో ఆ పిల్లలు రిషభ్ పంత్ ని చూసి చిరాకు పడేవారంటూ డ్రెస్సింగ్ రూమ్ ముచ్చట్లను రోహిత్ శర్మ నవ్వులు పూయిస్తూ పంచుకున్నాడు.

# ఒకే మూడ్.. ఒకే టెంప్లేట్.. బన్నీ సినిమాకు మొదట్లోనే ట్విస్ట్!







టాలీవుడ్ లో ఇప్పుడు కొత్త సమస్య మొదలైంది. ఏ పెద్ద సినిమా చూసినా ఒకే తరహా టెంప్లేట్, ఒకే మూడ్ కనిపిస్తోంది. హీరోలందరూ తెరపై సరికొత్తగా కనిపించాలని తాపత్రయపడుతున్నప్పటికీ.. చివరికి అందరూ ఒకే రకమైన డార్క్, రస్టిక్ ప్రపంచాల్లోకే అడుగుపెడుతున్నారు. బాక్సాఫీస్ దగ్గర ఏదో ఒక సినిమా క్లిక్ అవ్వగానే, మిగిలిన డైరెక్టర్లంతా తమ హీరోలను కూడా అదే మూస ధోరణిలోకి నెట్టేస్తున్నారనే చర్చ ఇప్పుడు ఫిల్మ్ సర్కిల్స్ లో జోరుగా సాగుతోంది.

శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్ లో నాని చేసిన 'ది ప్యారడైజ్', బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్ చరణ్ నటించిన 'పెద్ది' ప్రాజెక్టుల విషయంలో ఈ పోలికలు ఎక్కువగా వినిపించాయి. ఈ రెండు భారీ చిత్రాలు రా అండ్ రస్టిక్ నేపథ్యంలో సాగే ఇంటెన్స్ డ్రామాలే. అయితే స్క్రీన్ పై కనిపించే డార్క్ విజువల్స్ నుంచి హీరో ఎలివేషన్లు, హెవీ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వరకు రెండింటి మధ్య ఉన్న డిఫరెన్స్ చూసి.. ఇవి రెండూ ఒకే ఫార్మాట్ లో అటు ఇటు తిప్పి తీసినట్లు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.స్టార్టింగులో ఇలాంటి రస్టిక్ అవతారాలు, రక్తపాతం ఆడియన్స్ కు కాస్త థ్రిల్ ఇచ్చాయి. కానీ వరుసగా ప్రతి స్టార్ హీరో అదే మట్టి గెటప్, అదే గ్యాంగ్ స్టర్ నేపథ్యంతో వస్తుంటే థియేటర్లలో ఫ్రెష్ నెస్ పూర్తిగా దెబ్బతింటోంది. సినిమా టైటిల్ మారినా చూసే విజువల్స్ లో తేడా లేకపోవడంతో ఆడియన్స్ లో క్రమంగా విసుగు మొదలవుతోంది. క్రియేటివిటీ అంటే స్క్రీన్ మొత్తం నలుపు, ఎరుపు రంగులతో నింపేయడం కాదనే విమర్శలు ఇండస్ట్రీ వర్గాల నుంచే వస్తున్నాయి.ఈ రొటీన్ ఫార్ములా సెగ ఇప్పుడు అల్లు అర్జున్ లోకేష్ కనగరాజ్ ప్రాజెక్ట్-ూూ23 కు కూడా తగిలింది. ఈ క్రేజీ కాంబినేషన్ సెట్ అవ్వగానే బన్నీ లుక్ కోసం ముంబైలో ప్రత్యేకంగా ఒక లుక్ టెస్ట్ వీడియోను షూట్ చేశారట. ఆ వీడియోతోనే సినిమాకు సంబంధించిన ఫస్ట్ ఇంపాక్ట్ ఇవ్వాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే సరిగ్గా అదే టైమ్ లో మరో స్టార్ హీరో గ్యాంగ్ స్టర్ మూవీ నుంచి అచ్చం అలాంటి డార్క్ టోన్ తో ఉన్న ప్రమోషనల్ వీడియో బయటకు వచ్చింది.వేరే సినిమా వీడియోతో తమ కాన్సెప్ట్ సింక్ అవుతుండటాన్ని గమనించిన ూూ23 టీమ్ వెంటనే అప్రమత్తమైంది. ఇప్పుడు తాము ఆ వీడియోను రిలీజ్ చేస్తే వేరే సినిమాను కాపీ కొట్టినట్లు ఉంటుందనే ఉద్దేశంతో, తమ పాత ప్రమోషనల్ ప్లాన్ ను ప్రస్తుతానికి పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. తమ లుక్ టెస్ట్ ను మళ్లీ కొత్తగా ఎలా డిజైన్ చేయాలనే దానిపై లోకేష్ టీమ్ పునరాలోచనలో పడింది. ఒకే ట్రెండ్ ను అందరూ ఫాలో అవ్వడం వల్ల మొదట్లోనే ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి.తెలుగు సినిమాకు అసలైన బలం వైవిధ్యమైన కథలను, లోతైన ఎమోషన్లను చూపించడమే. ఒక హీరోకు లేదా ఒక దర్శకుడికి వర్కౌట్ అయిన స్టైల్ ఇండస్ట్రీలో అందరికీ సెట్ అవుతుందనే గ్యారెంటీ ఉండదు. ప్రతి ప్రాజెక్ట్ కు ఒక విలక్షణమైన ఐడెంటిటీ ఉన్నప్పుడే ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తారు. పాత సక్సెస్ ఫార్ములాలను జిరాక్స్ తీయడం మానేసి, రూట్ మార్చి కొత్త ఐడియాలతో వస్తేనే దర్శకులకు బాక్సాఫీస్ దగ్గర లాంగ్ రన్ ఉంటుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com